తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

ఆగష్టు-2024 ✦ వెల: ₹20




శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ
హాస్య కథల పోటీలో
బహుమతి పొందిన కథలు

బాచి పురస్కారం-2024
కార్టూన్ పోటీ ఫలితాలు

సోమయాజుల శివరామయ్య,
హైమవతి స్మారక
కార్టూన్ పోటీ ఫలితాలు






చవకబారు వస్తువులు విలువైనవి కావు...
విలువైన వస్తువులు చవకగా ఉండవు!!

Jaquar

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street,
Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక

జీ'వనం'లో నవ్వు నవ వసంతం

# హాస్యానందం

ఆగష్టు-2024

21వ సంవత్సరం
242 వ సంచిక

ముఖచిత్రం: మాళవిక శర్మ, కార్టూన్: గోపాలకృష్ణ

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**
email: **hasyanandam.mag@gmail.com**
web: **www. hasyanandam.com**

*Full Pillar* : Bnim
*Cartoon Feature Editor*: Bachi

*Creative Team*
Dr. K.Ramakrishna,
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar,
Dayakar, Gandhi, Nagisetty, Bomman
GopalKrishna, Sangram, Krishna

*D.T.P:* P. Ramalakshmi, 9440304993
*Digital Media Director:* Surya

| | |
|---|---|
| సంవత్సర చందా-రూ.300/- (పోస్టల్ చార్జీలతో) | 2 సంవత్సరాల చందా-రూ.500/- (పోస్టల్ చార్జీలతో) |

**జీవిత చందా- రూ.5000/-లు**


Gpay *or* Ppay # **9849630637**

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad. Cell. 9666680857.

*Publisher& Editor-*
*Ramu.P*

*Well Wishers:*
Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Gudibandi Venkata Reddy
Dr.V.V.Rama Kumar

*Prize Sponsers*
K.V.V.Satyanarayana,
*Cartonist* JSR
K.Sundaresayya &
Satyavathi
Md.Raj Mohammed
Nimmi Madhubala
Mallika, Lakshmi
P. Srikantha Sarma


**Smile in Every Page...Satisfaction in Every Smile**

# ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...

**ముళ్లపూడి హాస్య కథల పోటీలో బహుమతి పొందిన కథలు**

## కథలు


| | | |
|---|---|---|
| అక్షర స్వయంవరం | -పోలాప్రగడ జనార్ధనరావు (జెన్ని) | -22 |
| సంసార సర్వస్వం | -ద్విభాష్యం రాజేశ్వరరావు | -24 |
| స్వామీజీ దీవెన | -డి వి డి ప్రసాద్ | -26 |
| చెయ్యి తిరిగితే.... | -ఎన్.డి.ఎస్.వి. నాగేశ్వరరావు | -28 |
| భామా కలాపం | -మధులిక పైడిమర్రి | -32 |
| పడుచు పెళ్ళాం- సైకిల్ సవారీ | -రంగనాధ్ సుదర్శనం | -34 |
| అలా జరిగింది | -కొత్తపల్లి రవి కుమార్ | -36 |
| వంట వచ్చిన మొగుడు | -యలమర్తి అనూరాధ | -38 |
| ఉత్తమురాలు | -మోచర్ల అనంత పద్మనాభరావు | -40 |
| భాష | -మన్నవ ప్రియసిస్టర్స్ | -42 |


## స్పెషల్స్


| | | |
|---|---|---|
| బాచి అవార్డు-2024 కార్టూన్ పోటీ ఫలితాలు | | -16 |
| శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక కార్టూన్ పోటీ ఫలితాలు | | -19 |
| లాఫింగ్ రాఖీ | -పద్మ | -35 |


## శీర్షికలు


| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -8 |
| తెలుగా మజాకా?! | డాక్టర్ కప్పగంతు రామకృష్ణ | -10 |
| వాక్చిత్రం | సుధామ | -21 |
| నవ్వులాట | గాంధీ మనోహర్ | -44 |
| పదానందం | పోపూరి విశ్వనాథ్ | -50 |


## సీరియల్



| | | |
|---|---|---|
| కొంగుచాటు కృష్ణుడు | -యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి | -12 |
| ఇందు చందు-నవ్వులవిందు | కండ్లకుంట శరత్‌చంద్ర | -46 |



## కార్టూన్ శీర్షికలు




| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -14 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -15 |
| నవ్వే ఆనందం | -సరసి | -15 |
| డబుల్ ధమాకా | -గోపాలకృష్ణ | -23 |
| రిటైర్డ్ లైఫ్ | -బొమ్మన్ | -25 |
| చిలిపి చిలుకలు | -మురళీధర్ | -37 |
| ఈ నెల దినం | -రామ్‌శేషు | -49 |












## ఈ సంచికలో కార్టూనిస్ట్‌లు

- జయదేవ్
- సరసి
- సంగ్రామ్
- గౌతమ్
- శేఖర్
- సునీల్
- గోపాలకృష్ణ
- శర్మ
- రామ్‌శేషు
- దొరశ్రీ
- గాంధీ
- నాగిశెట్టి
- డేవిడ్
- నాథ్
- ప్రసిద్ధ
- గిరి
- అత్తలూరి
- చక్రవర్తి
- వినోద్
- ఓంకార్
- శ్రీకార్
- శేఖర్‌బాబు
- ఆయుషి
- అరుణ్
- తోపల్లి ఆనంద్
- పద్మ
- శివ
- టి.ఆర్.బాబు
- గంగాధర్
- బొమ్మన్
- కాశ్యప్
- సురేష్
- మురళీధర్
- రవీంద్ర
- బీవీఎస్
- టి.భాస్కర్
- గుత్తుల శ్రీనివాస్
- వర్మ
- సురేంద్ర
- క్రిప్

**గమనిక:**

ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

# హాయ్...సానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు...సన్నిహితులకు హాస్యాభివందనాలు!**

**క**రవమంటే కప్పకి కోపం... విడవమంటే పాముకి కోపం!

మనం చాలాసార్లు విన్న సామేతే ఇది. కచ్చితంగా ఈ రెండిట్లో ఒకదానికే మనం 'న్యాయం' చేయగలం...

ఇక రెండోదాని ఫలితం అనుభవించక తప్పదు.

మనలో చాలా మంది అందరితో మంచి అనిపించుకోవాలని చాలా తాపత్రయ పడుతుంటారు. ఆ క్రమంలో ఎవరి దగ్గరుంటే వాళ్ళకి వత్తాసు పలుకుతూ ఎదుటివాళ్ళను చులకన చేసి మాట్లాడుతూ కాలం గడుపుతుంటారు.

వాస్తవంగా నూరుశాతం అందరినీ మెప్పించటం చాలా కష్టం!

కానీ ఏవో ప్రయోజనాల కోసం గోడమీద పిల్లి వాటంలా ప్రవర్తించే వారు చాలా ప్రమాదకారులు. వాళ్ళు అనుకున్నది అమలు చేయడం కోసం ఎంతకైనా దిగజారుతారు. మన మెప్పు కోసం మనకెంతో సహాయం చేస్తున్నట్లు ప్రవర్తించే వీరి వలన మనం ఇబ్బందులపాలవుతాం!

ఇలాంటి వాళ్ళతో మనం చాలా జాగ్రత్తగా ఉండాలి.

సాధ్యమైనంతవరకు అటువంటివారికి దూరంగా ఉండటమే శ్రేయస్కరము.

అలాగని పూర్తిగా దూరం చేసుకోకుండా అంటీ ముట్టనట్లు తామరాకు మీద నీటి బొట్టులా ఉండాలి!

ఇలా మనం అలాంటివారి పట్ల 'పరిధి' ఏర్పాటు చేసుకుంటే మన ఆనందాలకి మనమే కారకులౌతాము. మనకు ఎవరు నిజమైన స్నే'హితులో' గుర్తెరిగి... ప్రవర్తించే తీరు కచ్చితంగా మనల్ని సంతోషంగా ఉంచుతుంది.

అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ.....








✦ **పి.వి.మధునివ్రితి, సికింద్రాబాద్**

**పొత్తూరు** విజయలక్ష్మి గారి పై ప్రత్యేక సంచిక (జూలై,2024) చక్కగా ఉన్నది. 'శ్రీవారికి ప్రేమ లేఖ' సినిమా వారి నవల 'ప్రేమలేఖ' ఆధారంగా తీసినది అని ఇప్పుడే తెలుసుకున్నాము. జంధ్యాలగారి పై కూడా ప్రత్యేక సంచిక త్వరలో ప్రచురించగలరని ఆశిస్తున్నాము.

✦ **శ్రీనివాస్ శ్రీలేఖ, హైద్రాబాద్**

**జూలై** 2024 సంచిక 'హాస్యాభిషేకం' ఆలోచన బాగుంది. హాస్య బ్రహ్మలను సత్కరించే ఉన్నతమైన ఉద్దేశం, వారికి పట్టాభిషేకం చేసే వినుత్న ఆలోచన, ప్రత్యేక సంచిక వెలువరించడం అనే మహాత్కార్యం చాలా స్ఫూర్తిదాయకం, మెచ్చుకోదగినది, ప్రశంసనీయం. 'అపహాస్యం–బూతులు లేని' హాస్య కథలకు చిరునామా అయిన హాస్యానందం హాస్యపత్రికకు మా అభినందనలు. ప్రోత్సాహకరపు నిర్వహణ వ్యాపింప చేసే హాస్యానందం సంపాదకులకు మరియు బృందానికి హాట్స్ ఆఫ్.




✦ **టి.శ్రీకాంత్, చెన్నై**

**జూలై** సంచిక శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారి ప్రత్యేక సంచిక చాలా గొప్పగా ఉంది. హాస్యాన్ని పండించేవారికి మీరు చేస్తున్న ఈ సన్మానం అభినందించదగ్గది. వారు చేస్తున్న కృషికి మంచి గుర్తింపు ఇది. ఇందులో కథలు, అభినందనలు అన్నీ చదివాక అనిపించిందేమిటంటే గొప్పవాళ్ళు ఎక్కడో ఉండరు మనమధ్యే ఉంటారనిపించింది. విజయలక్ష్మిగారికి అభినందనలు. ఇంత మంచి పుస్తకం అందించిన మీకు ధన్యదాలు.

✦ **బి.సూర్యనారాయణ, విశాఖపట్టణం**

**శ్రీ**మతి పొత్తూరి విజయలక్ష్మిగారి ప్రత్యేక సంచికగా వచ్చిన జూలై హాస్యానందం చాలాబాగుంది. ఆమె నవలలు, కథల సంపుటిలను ఎవరికైనా బహుమతిగా ఇవ్వవచ్చు. ఆమె గురించి ప్రముఖులు చెప్పిన మాటలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి. కథల్లో 'రోలు మోడలు' సింప్లీ సూపర్బ్. ఇంతవరకు ఏ రచయితా స్పృశించని సబ్జెక్ట్!... 'చిన్ని ప్రశ్న' కథ అన్ని భాషల్లోకి అనువాదం కావల్సిన కథ! పాఠ్య పుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చ దగ్గది. అభినందనలతో.

✦ **కోరుకొండ ప్రమీలారాణి,బెంగళూరు**

**హా**స్యానందం జూలై సంచిక నిజంగా ప్రత్యేకంగా ఉంది. ఒక రచయిత్రి గురించి చాలా విషయాలు చెప్తునే.... ఆవిడ కథలు, ఆవిడ గురించి ప్రముఖుల అభిప్రాయాలు ఇవ్వటం బాగుంది. ఏమాత్రం విసుగనిపించని ఈ సంచిక రూపకల్పన చేసిన మీకు అభినందనలు.

ఆహ్వానము
GVR CULTURAL FOUNDATION
జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్
22వ వార్షికోత్సవ వేడుకలు
టీవీ.యాంకర్స్ పురస్కారాల ప్రదానోత్సవం
తేది: 08.08.2024 సాయంత్రం 5.30గంటలకు
వేదిక: శ్రీ త్యాగరాయగాన సభ(ప్రధాన మందిరం) చిక్కడపల్లి, హైదరాబాద్

# ఆహ్వానము


## బాచి అవార్డు & శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక కార్టూన్ల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదాన సభ

**శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక అవార్డు-2024 ప్రదానం**


అవార్డు గ్రహీత-
ప్రముఖ కార్టూనిస్ట్
శ్రీవాడ్రేవు శ్రీనివాస్



**పుస్తక ఆవిష్కరణలు**




ప్రముఖ కార్టూనిస్టులు
శ్రీ ప్రసిద్ధ &
శ్రీ మాంటెక్రిస్టో
కార్టూను పుస్తకాలు
ఆవిష్కరణ!



ఆగష్టు,15 వ తేదీ, గురువారం, సాయంకాలం 6గంటలకు.
విజయవాడ బందరురోడ్డులో రాఘవయ్య పార్క్ ఎదురుగా ఉన్న 'బాలోత్సవ భవన్‌లో'

---

హాస్యానందం సౌజన్యంతో

భారతీయ జ్యోతిర్వాస్తు విజ్ఞాన సంస్థ, అమరావతి వారి సమర్పణలో

# దసరా కార్టూన్ల పోటీ

జ్యోతిష, వాస్తు శాస్త్రములను ఏ విధంగానూ కించపరచకుండా, వాటి లోని పెడధోరణులను, లోపాలను సున్నితంగా, వ్యంగ్యంగా, హాస్యస్ఫోరకంగా ఎత్తిచూపే కార్టూన్‌లను పోటీకి ఆహ్వానిస్తున్నాము.

**అంశం: జ్యోతిష్యం, వాస్తు**

| మొదటి బహుమతి | రెండవ బహుమతి | మూడవ బహుమతి |
|---|---|---|
| రూ. 2,000/- లు | రూ. 1,500/- లు | రూ. 1,000/- లు |

**10 ప్రోత్సాహక బహుమతులు ఒకోక్కరికీ -రూ. 500/-లు**

కార్టూన్లు మాకు చేరవలసిన ఆఖరు తేదీ- **సెప్టెంబర్-01,2024.**
కార్టూన్లు ఈ మెయిల్‌కి పంపండి- hasyanandampoteelu@gmail.com


## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు


**4000 రూపాయల బహుమతులు**

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **ప్రతి నెలా** హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు **ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**



'కార్టూన్ మిత్ర'
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు** బహుమతిగా ఇస్తున్నారు.











**శ్రీమతి నమ్మి మధుబాల**
**(బాపు) రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్)**
కార్టూన్ కళ పై ఆరాధనతో... ఈ మూడు ప్రోత్సాహక బహుమానం ఇస్తున్నారు.


← మొదటి బహుమతి- **రూ.500/-లు**
↙ రెండవ బహుమతి- **రూ.300/-లు**
↓ మూడవ బహుమతి- **రూ.200/-లు**






కార్టూనిస్ట్ **శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






**శ్రీ కుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.





కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
ఈ కార్టూన్‌కి
**500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.





**దివ్యశ్రీ శ్రీమతి చిట్టావఝుల యల్లారి**
బాల వెంకట సత్య సూర్యకాంతం జ్ఞాపకార్థం
కుమార్తెలు **మల్లిక, లక్ష్మీ** అందిస్తున్న
ప్రోత్సాహక బహుమానం-
**500 రూపాయలు**



## ప్రతి నెలా పోటీలే!

కార్టూనిస్టు మిత్రులకు నమస్కారం. ప్రతి నెలా హాస్యానందంకు వచ్చే కార్టూన్లలోంచి **8 మంచి కార్టూన్లకు బహుమతులు** ఇస్తున్నారు కార్టూన్ ఇష్టులు! మీరు ఇక నుంచి పంపే కార్టూన్లకు బహుమతి రావాలనే ఉద్దేశంతోనే కార్టూన్లు గీయండి! సందేశాలున్నప్పటికీ హాస్యం మాత్రం 'మిస్' కాకుండ చూస్కొంటే... మీకు బహుమతి 'మిస్' అవ్వదు. ఆల్ ది బెస్ట్!




డాక్టర్ కప్పగంతు రామకృష్ణ
*ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ పాలక మండలి సభ్యులు*
90320 44115

**ఆధునికత పెరిగిన ఇప్పటి తరంలో భాష కూడా ఎన్నో ఆధునిక పోకడలు పోతోంది. దీని వల్ల అర్థాలు మారి అనర్థాలు జరుగుతున్నాయి. తెలుగు మాట్లాడే క్రమంలో జరిగే పొరపాట్లు, వాటివల్ల జరిగే తప్పులు, వాటిని సరిచేసుకోవాల్సిన విధానాలు అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో... భాషా చమత్కారాన్ని ఉపయోగిస్తూ చేస్తున్న ప్రయత్నం ఇది.**

**(జూన్ సంచిక తరువాయి)**

**"ఉ**గాది పండుగ చేయసుకోవటంలో ప్రచార ఆర్భాటం తప్ప మన ఆచారం, సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఏ ఒక్కరికీ ప్రేమ లేదు. కనీసంగా ఆచారాలు పాటించాలన్న యావ లేదు. మనకే భాష, ఆచారాలు తెలియకపోతే మన పిల్లలకు ఏం చెబుతాం. వాళ్ళు వాళ్ళ పిల్లలకి ఏం చెబుతారు. తెలుగుతల్లి ఏం పాపం చేసుకుందయ్యా?!"... అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్నా... ఎదురుగా మనిషి కనిపించకపోయేసరికి, కాస్తంత కంగారు వేసింది.

వెనుకనుంచి రత్నం నా మీద చెయ్యి వేసి... మరో చేతిని నా కాళ్ళవైపు చూపించింది. పరంధామయ్య నా కాళ్ళ దగ్గర కూలబడి కనిపించాడు. బిత్తర చూపులు చూస్తున్నాడు. కొద్దిగా పైత్యపు ఛాయలు కూడా అతడిలో కనిపిస్తున్నాయి.

'అన్నీ తెలిసిన' మనిషి కనుక, రత్నం అప్పటికే నిమ్మకాయ నీళ్ళు కలిపి తెచ్చి, అతగాడి చేతిలో పెట్టింది. అమృతం దొరికినంత ఆనందంతో తాగేసాడు పరంధామయ్య.

"అమ్మా! చల్లని తల్లీ! ప్రాణం నిలబెట్టావు. నీకో నమస్కారం. అందరూ అంటుంటే ఏమిటో అనుకున్నా. వడదెబ్బ కన్నా మాస్టారి మాటల దెబ్బ గొప్పది తల్లీ. ఆ దెబ్బకు వైద్యం ఉంది. మాస్టారి దెబ్బలకు వైద్యం లేదు. యోగం ఉంటే ప్రాణాలతో బయటపడటమే...

మాస్టారూ!... ఉగాది కార్యక్రమానికి మీరొస్తే నా మీద ఒట్టే!" అంటూ గోడ పట్టుకుని లేచే ప్రయత్నం చేస్తున్నాడు పరంధామయ్య.

"అదేమిటయ్యా... ఇంతకుముందు కార్యక్రమానికి రాకపోతే నీ మీద ఒట్టు అన్నావు..." అంటూ గుర్తుచేసే ప్రయత్నం చేసాను.


సెకనులో మెరుపులా మాయం అయ్యాడు పరంధామయ్య.

అప్పటికే అప్పడాల కర్రతో సిద్ధంగా ఉన్న రత్నాన్ని చూసే సరికి, నాకూ 'ఏంటో'గా అనిపించడం మొదలైంది.

బంగాళదుంప వేపుడు చేసిన కమ్మటి వాసన ముక్కుపుటాలకు అప్పటికే తగలటంతో బుద్ధిగా వంటింటి వైపు నడిచా.

✦✦✦

"ఏమండోయ్... మిమ్మల్నే! ఇది విన్నారా?" అంటూ రత్నం పొలికేక వినబడే ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను. ఆదివారం కదా... ఎలాగూ బడికి వెళ్ళే పని లేదు. పిల్లలు కూడా స్నేహితులతో ఆడుకోవడానికి బయటకు వెళ్ళారు. ఇల్లంతా ప్రశాంతంగా ఉండటంతో, వాలుకుర్చీలో సేదతీరుతున్న నాకు కునుకు పట్టింది. కానీ, ఏం లాభం. ఉరుములాంటి రత్నం అరుపుతో మెలకువ వచ్చేసింది.




నిద్ర పాడు చేసిందన్న కోపంతో... "ఇంకా వినలేదు. నువ్వు చెబితే వింటా... మొదలుపెట్టు!" అన్నాను.

"ఈ వెటకారాలకేం తక్కువ లేదు. ఇంతకీ ఏం జరిగిందంటే... మా మేనత్త కొడుకు వేణు ఇంట్లో నానా భీభత్సం చేస్తున్నాడట. రాను రాను కోపధారి అయిపోతున్నాడట... సంబంధాలు తెచ్చే బ్రాహ్మణ్ణి

కూడా ముప్పతిప్పలు పెడుతున్నాడట.

ఇప్పుడే మా మేనత్త ఫోన్ చేసిందండీ. రెండు లక్షలు కట్నం అంటే ముష్టి ఇంతేనా అంటున్నాడు. నా ప్రతిష్ట ఏం కావాలంటాడు. ఏ సంబంధం తెచ్చినా ఏదో ఒక సాకు చెబుతాడు... నా మేధస్సుకి తగిన అమ్మాయి కావాలంటాడు. వాడి పిచ్చితో బ్రహ్మాండమైన సంబంధాలన్నీ పోతున్నాయి... ఇలాగైతే సంబంధం ఎప్పటికి కుదురుతుందో అని అత్తయ్య చాలా బాధ పడుతోందండీ" అంటూ రత్నం అంతులేని విచారం వ్యక్తం చేసింది.


"మీ అత్తయ్య సంగతి, వేణు సంగతి నేను చూస్తాను కానీ, నువ్విలా రా!" అంటూ రత్నం చెయ్యిపట్టుకుని ముందుకు లాగాను.

"ఏమిటో చెప్పండి..." అంటూ నా పక్కగా కూర్చుంది.

"మీ వేణుగాడికి సంబంధం ఎందుకు కుదరడం లేదో తెలుసా?" అన్నా.

"మీకు తెలిస్తే చెప్పరాదూ!..." అంటూ మూతి మూడువంకరలు తిప్పింది.

సంబంధాలు తెచ్చేది **బ్రాహ్మడు** కాదు. **బ్రాహ్మణుడు** అనాలి. అయినా... వాడికి సంబంధం నచ్చలేదనుకో. **భీభత్సం** చెయ్యకూడదు. **బీభత్సం** చేస్తే చాలు. ఎందుకంటే భీభత్సం అనేది తప్పు పదం. ఇక, వాడు **కోపధారి** అవుతున్నాడని నువ్వు, మీ మేనత్తా బాధ పడకూడదు. అసలు మీరలా అనడం వల్లే వాడు అలా తయారవుతున్నాడు. కేవలం **కోపిష్టి** అని మాత్రమే అనాలి.





వాడివైపు కూడా తప్పు ఉందనుకో. కట్నం నచ్చకపోతే **ముష్టి** అనాలి కానీ **ముష్ఠి** అనకూడదు. వాడి ప్రతిష్ట ఎక్కడికీ పోదు. ఎందుకంటే **ప్రతిష్ట** అనకూడదు. ఆ పదానికి అర్థం లేదు. **ప్రతిష్ఠ** అనాలి. ఇక, అన్నిటికన్నా గొప్ప విషయం... వాడికి మేధస్సు లేదు. ఎందుకంటావా? తెలుగులో **మేధస్సు** అనే పదమే లేదు. **మేధ** అనే పదం మాత్రమే ఉంది. కాబట్టి, ఈ జన్మలో వాడి మేధస్సుకి తగిన సంబంధం రానే రాదు.

అసలు రహస్యం చెప్పనా.... ఈ సృష్టిలో బ్రహ్మాండమైన సంబంధం అనేదే ఉండదు. ఎందుకంటే... మాటవరుసకి **బ్రహ్మాండం** అనే పదాన్ని పెద్ద లేదా జగత్తు అనే అర్థాలో ఉపయోగిస్తున్నారు... కానీ నిజానికి బ్రహ్మాండం అంటే బ్రహ్మగుడ్డు అని అర్థం. మీ అత్తయ్యతో చెప్పు....పదహారణాల తెలుగు పిల్లను చూసుకోమను కానీ ఈ గుడ్డు సంబంధాలు ఎందుకే రత్నం.


ఇన్ని తప్పులు పెట్టుకుని మీ అత్తయ్య భాధ పడి ఏ ప్రయోజనమూ లేదు. ఎందుకంటే, ఆవిడ **బాధ** పడాలి కానీ **భాధ** పడకూడదు. ఇవన్నీ జరిగితేనే మీ వేణుగాడికి సంబంధం కుదురుతుంది..." అంటూ గిరీశం తరహాలో ఉపన్యాసం దంచి కొట్టేసా.

"ఇక ఆపండి మీరూ మీ వెటకారాలూ. ప్రతి మాటకీ అర్థాలు, నానార్థాలు, పెడర్థాలూను. అయ్యో... అయ్యో... ఈ మనిషితో ఏం మాట్లాడాలన్నా భయమేస్తోంది. మాట మాట్లాడితే దీర్ఘాలూ, ఒత్తులూ, కొమ్ములూ, పొట్టలో చుక్క... అమ్మ బాబోయ్! నిక్షేపం లాంటి బొంబాయి సంబంధం కాదని, ఉన్న ఊళ్ళో సంబంధం అంటూ మా నాన్న మీకు కట్టబెట్టాడు. అయినా....ఎవర్నని ఏం లాభం. నా రాత ఇలా కాలిపోయింది...."

రత్నం తిట్ల దండకం ఇంకా కొనసాగుతూనే ఉంది. పరిస్థితి చెయ్యి దాటకముందే... రేడియోలో వాతావరణ హెచ్చరికలు విని జాగ్రత్త పడినట్లు... నెమ్మదిగా అక్కడ నుంచి జారుకున్నా.




**(సశేషం)**



కథ-కథనం

యండమూరి వీరేంద్రనాథ్
యర్రంశెట్టి శాయి





# కొంగుచాటు కృష్ణుడు



**గతంలో...** రంభ, ఊర్వశి, తిలోత్తమలు ముగ్గురూ కలిసి ప్రారంభించిన 'మన్మధా మెన్స్ బ్యూటీ పార్లర్' మూడవ బ్రాంచి ప్రారంభంతో పాటు 'మేడ్ ఫర్ ఈచదర్' పోటీని ప్రకటించారు. ఆ పోటీలో పాల్గొన డానికి దేవలోకంలో అందరూ సిద్ధమవుతున్నారు... ఈలోగా మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, సరస్వతి ముగ్గురు మగ పిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. భర్తతో సవాలు చేసి సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. కెమిస్ట్రీ ల్యాబులో రహస్యంగా చేస్తున్న ప్రయోగం ఫలించక ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు. **ఆ తర్వాత...**

**చంద్రబోసు మళ్ళీ దూకటానికి ప్రయత్నం చేశాడు కానీ, ఈసారి ఎందుకో చావబుద్ధి కాలేదు. ఆలోచనలో పడ్డాడు.**

**తన ఫార్ములా కోసం పాకిస్తానే రహస్య గూఢచారిని పంపిందంటే... తన గురించి భారతదేశానికి తప్ప ప్రపంచం మొత్తానికి తెలిసిందన్న మాట! అటువంటప్పుడు తానెందుకు చావాలి?**

**ఒకవేళ చచ్చినా, చచ్చేముందు తన గొప్పతనం భారతదేశం తెలుసుకోవాలి! రావులపాలెం నుంచీ అలస్కా వరకూ అన్ని సైన్స్ మ్యాగజైన్స్‌లో తన పేరు రావాలి! పద్మశ్రీ మరీ ఎక్కువనుకుంటే కనీసం నోబెల్ ప్రైజు రావాలి!...**

ఇళయరాజా తన మీద 'సాహో చంద్రబోసూ' అని పాట కట్టాలి!...తను సామాన్య సైన్స్ టీచర్ కాదని హెడ్ మాస్టారు వసంతకు అర్థమవాలి! తన మీద అప్పుడప్పుడు చూపే దురుసుతనానికి బషీర్ పశ్చాత్తాప పడాలి! తన పెళ్ళానికి తన ప్రతిభ అర్థమవ్వాలి! 'ఇప్పుడు చచ్చిన నా మొగుడు, ఒకప్పుడు ఆరేసిన రసాయనం. పారేసుకున్న అక్షరానికి భయపడని రుధిరం!' అని తన మీద ఆమె వ్రాసిన కవితకి సాహిత్య అకాడమీ అవార్డు తీసుకుంటూ స్టేజి మీద కన్నీళ్లు పెట్టుకోవాలి!

✦✦✦

ఆ విధంగా అతడు ఆశ్చర్యార్థకాలు ఎక్కువైన ఆలోచనలతో వెనక్కి తిరిగి ఇంటి వైపు నడక సాగించాడు.

అది చూసి సరస్వతి సంతోషంగా మేఘాల చాటుకి తప్పుకుంది.

✦✦✦

"మా మాస్టారు డబ్బుకి లొంగిపోతాడనుకున్నాను బాస్. పైసల కోసం వాళ్ళావిడ రోజూ ఫైటింగ్ చేస్తుంది. ఆవిడ కోసమయినా ఒప్పుకుంటాడనుకున్నాను" మరో బీడీ వెలిగిస్తూ అన్నాడు బషీర్.

ఆ మాటలకి ట్రిబుల్-జీరో దిగులుగా నిట్టూర్చాడు. ఇద్దరూ చెట్ల వెనుక మాట్లాడుకుంటున్నారు. ప్రకృతి వాళ్ళ వైపు దిగులుగా చూసి నిట్టూర్చింది.

"ఇప్పుడేమిటి చేయటం?" అతడు అంటూ ఉండగా పాకెట్ ట్రాన్సిస్టర్ బరబరమంటూ శబ్దం చేసింది.

ఆ శబ్దం విని ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

"మన బాస్ పిలుస్తున్నాడు!" అంటూ బషీర్ దాన్ని ఆన్ చేయబోయి అనుమానంగా ఆకాశంలోకి చూశాడు.

తమని గమనిస్తూ భారత గూఢచారి హెలికాప్టర్లు ఏవీ పైన తిరగటం లేదని నిశ్చయించుకున్నాక ట్రాన్సిస్టర్ ఆన్ చేసి, "చెప్పు కింద రాయి!" అన్నాడు.

"నెత్తి మీద గొడుగు!" అని అట్నుంచి వినపడింది. ఓ క్షణం మాట్లాడి, "పద!...ఇక్కడే మరో స్లీపర్ ఎవరో ఉన్నాడట. మనకేదో చెప్పాలట!" అన్నాడు.

ఇద్దరూ చెట్ల చాటు నుంచి మెయిన్ రోడ్ ఎక్కి కొంత నడిచి ఓ కిళ్ళీ కొట్టు ముందు ఆగారు.

వెంకటేశ్వర్లు ఉరఫ్ వాలీద్ అహమ్మద్ అక్కడ కిళ్ళీ కడుతున్నాడు.

"గుడ్డు పెట్టేది కోడి!" అన్నాడు ట్రిబుల్-జీరో.

"పిల్లల్ని పెట్టేది పిల్లి!" అన్నాడు కిళ్ళీ కొట్టు అహమ్మద్.

"పెట్టిన పిల్లలు పెద్దవుతాయి!"

"పెద్ద పిల్లులు పిల్లల్ని పెడతాయి!"

"పాకిస్తాన్ లో పి.ఓ.కే!"

"లాహోర్ లో చార్మినార్!"

"ఆగండెహే!!..." బషీర్ విసుగ్గా అన్నాడు.

"...ఇద్దరూ మన దేశం ఏజెంట్లే అని తెలిసింది కదా. ఇంకా కోడ్స్ ఎందుకు? అసలు విషయానికి రండి".

"ఇప్పుడే పాకిస్తాన్ నుంచి సీక్రెట్ ఇన్‌ల్యాండ్ కవర్ వచ్చింది. చంద్రబోసు కనుక్కున్న గ్యాస్... అమెరికాలో పాతికేళ్ళ క్రితమే కనుక్కున్నారట. ఇప్పుడది ఎవ్వరూ వాడనంతగా పాతబడి పోయిందట".

బషీర్ మొహం వాడిపోయింది.

త్రిబుల్-జీరో దిగులుగా... "ఎంత బ్యాడ్ బషీర్! నీ మాటలు నమ్మి నిజంగానే ఆ బోసు ఏదో గ్యాసు కనిపెట్టాడనుకున్నాను. దాన్ని పాకిస్తాన్‌కి ఇస్తే కనీసం చెరో అయిదారు వందలయినా వస్తాయని ఆశపడ్డాను!..." అన్నాడు.

"సర్సర్లే. వెధవ ముఖాలేసుకొని ఇంకా చూస్తారేమిటి? వెళ్ళండి. ఇంకెవరైనా సైంటిస్టులు ఇంకేవయినా కనిపెట్టారేమో వెళ్లి వెతకండి!" గద్దించాడు కిళ్ళీకొట్టు వెంకటేశ్వర్లు.

"బాస్!" గొణిగాడు త్రిబుల్-జీరో.

"ఏమిటి?"

"ఖర్చులకి చెరో పాతిక రూపాయలయినా ఇస్తే..."

"ఏమిటీ? పాతిక రూపాయలా..." మండిపడ్డాడు వెంకటేశ్వర్లు.


"...మీరేమన్నా అమెరికన్ సీక్రెట్ ఏజెంట్లనుకుంటున్నారా?... లేక రష్యన్ గూఢచార్లనుకుంటున్నారా? పని చేసేది పాకిస్తాన్ కోసమన్న విషయం గుర్తుంచుకోండి. ఇదిగో ఈ చెరో రెండ్రూపాయలూ బస్ చార్జీలకి తీసుకుని వెళ్ళండి!"

ఆ డబ్బు తీసుకొని ఇద్దరూ అక్కడినుంచి వెళ్ళిపోయారు.

✦✦✦

రాత్రి తొమ్మిది అయింది... బషీర్ బస్ దిగి, తన ఇంటి వైపు నడుస్తూంటే లోపల ఏదో






కదులుతున్నట్లు అనిపించింది.

భయపడి ఎగిరి గంతేశాడు. లోపల అది ఇంకా కదుల్తోంది. పైజమా బొందు సర్దుకుని, కదుల్తోంది 'జేబులో' అని గుర్తించాడు.

ఇండియన్ ఏజెంట్ ఎవరైనా తనకు తెలియ కుండా, భారతదేశంలో పాకిస్తానీ రహస్య స్థావరాలు ధ్వంసం చేయటానికి తన జేబులో బాంబు పడేశారా అని అనుమానం వచ్చింది.

అంతలో టైం బాంబులు కదలవని గుర్తొచ్చి జేబులో చేయి పెట్టాడు.

సగం నిద్రలో ఉన్న... జూకా భారంగా బయటి కొచ్చి, మళ్ళీ నిద్రలోకి జారుకుంది.


తేలిగ్గా శ్వాస తీసుకుని, అంతలో మళ్ళీ ఆ ఎలుకలో కొద్దిపాటి కదలికను గమనించి ఆశ్చర్యపోయాడు.

"చంద్రబోసు లెక్క ప్రకారం ఇది ఇంకా 40 గంటలు పైగా నిద్రపోవాలి కదా!... మరి ఇదేమిటి?... అంటే బోసు కనుక్కున్న ఈ పరి శోధన కూడా ఫెయిలయిందన్నమాట" అను కుంటూ దాన్ని కోపంగా రోడ్డు పక్కకు విసిరి వెయ్యబోయాడు. కానీ అంతలోనే చంద్రబోసు ఆఖరి మాటలు గుర్తొచ్చాయి...

"ఈ ఎలుకంటే నాకు చాలా ప్రేమ బషీర్! ప్రపంచంలోని జీవరాసులన్నిటిలోకీ నా భార్య ను ముప్పతిప్పలు పెట్టి నాకు సాయం చేసేది ఇదొక్కటే... ఇదొక్కటే...!!"

దాంతో ఎలుకని తీసుకెళ్ళి బోసు ఇంట్లో వదిలేయాలని నిర్ణయించుకున్నాడు.

వేగంగా వెళ్ళి... బోసు ఇంటి బెడ్‌రూము కిటికీలోంచి 'జూకా'ని లోపలికి విసిరేశాడు.




ఆవిడతో 'మొగుడు పోయాడ'ని చెపుదా మనుకున్నాడు కానీ టి.వి టైములో మనసు పాడుచేయటం ఎందుకనుకుని తన దారిన తను వెళ్ళి పోయాడు.

✦✦✦

బెడ్ పక్కనే ఏదో 'దబ్' మని పడటంతో, నిద్ర పోవటానికి ఉపక్రమిస్తోన్న లలితాదేవి చప్పున లేచి లైట్ వేసింది.

గాఢమైన మత్తులోంచి అప్పుడే కళ్ళు విప్పు తూన్న జూకా కనిపించింది.

అంతే..!

కోపం, కసి, ఆనందం ఒక్కసారిగా లోప ల్నుంచి తన్నుకువచ్చాయి.

పాన్ పరాగ్ తింటూ వికృతాట్టహాసం చేస్తూ... బల్ల క్రింద దాక్కొని తను చూస్తూ ఉండగా తల్లిదండ్రులను చంపేసి, తన అక్కను రేప్ చేసిన చిటికెన వేలిమీద పుట్టుమచ్చ ఉన్న విలన్, పాతికేళ్ళ తర్వాత కనబడితే... ఆ మచ్చ చూసి గుర్తుపట్టిన హీరో చేతి వేళ్ళ ఎముకలు టకటకా విరుచుకున్న చప్పుడుతో ఎలా బిగుసు కుంటాయో, అలా ఆమె పిడికిలి బిగించింది.

ఎన్నో రోజులుగా ఆమెకు ఆ ఎలుకపై కసి పెరిగిపోయి ఉన్నది. కేవలం తనను తిప్పలు పెట్టినందుకే కాదు. మొగుడి ప్రయోగాలకు ఉపయోగ పడుతోన్నదన్న కసి కూడా.

అడుగు వెనక్కి వేసి బల్ల మీద ఉన్న ఇత్తడి ఫ్లవర్‌వేజ్‌ని చప్పుడు కాకుండా తీసి పట్టు కుంది. ఊపిరి బిగపట్టి జూకా వైపు జాగ్రత్తగా గురి చూసి విసిరింది.

గాలిలో బాణంలా వెళ్ళి ఆ ఫ్లవర్ వేజ్ ఎలుకను బలంగా తాకటం... పెద్ద చప్పుడు... క్షణం నిశ్శబ్దం...

మళ్ళీ అదే వేగంతో వెనక్కు వచ్చి ఆమె చేతిని అంతే బలంగా కొట్టటం... అంతా క్షణాల్లో జరిగి పోయింది.

ఆమె నిశ్చేష్టురాలైంది.

బాధ కన్నా ఆశ్చర్యం ఎక్కువై, తన కళ్ళని తానే నమ్మలేనట్టూ కొద్ది క్షణాలపాటూ అలాగే చూస్తూ ఉండి పోయింది.

ఒక ఎలుక... అఫ్టాల్ ఒక స్మాల్ ర్యాట్! భయపడకుండా... అలా కదలకుండా కూర్చుంటుందా?

దాని వైపు మళ్ళీ అనుమానంగా చూసింది.

ముందు కాళ్ళు రెండూ పైకెత్తి, వెనుక కాళ్ళ మీద తాపీగా కూర్చుని కన్నార్పకుండా, ఉరిశిక్ష అనౌన్స్ చేసే ముందు జడ్జీ ముద్దాయి వైపు జాలిగా చూసినట్టు తన వైపు చూస్తున్నట్టూ అనిపించింది.

దాని కళ్ళల్లో ఏదో కొత్త వెలుగు!... దాని నల్లరంగు వెన్ను మీద బెడ్–లైటు పడి మూడు రంగుల గీతలు!

ఆమె గేయాలు వ్రాస్తుంది.

'ఇది ఎలుకా?

ఇనుప పలకా?

లేక నా కంట్లో నలకా? అనుకుంది.

ఫ్లవర్‌వేజ్ ఎలుకకు తగలటం ప్రత్యక్షంగా చూసింది తను... న్యాయంగా అయితే ఆ దెబ్బకు జూకా నుజ్జునుజ్జయి పోవాలి... అలాంటిది దానికి ఏమాత్రం దెబ్బ తగలక పోగా, మళ్ళీ అదే ఫోర్స్‌తో ఆ వేజ్ ఎలా వెనుకకు వచ్చింది? ఎలా సాధ్యమిది? ఒకవేళ తన కళ్ళు తనను మోసం చేశాయేమో... ఫ్లవర్ వేజ్ నేలకు తగిలి రీబఫ్ అయిందేమో...' అనుకుని, తర్జని పైకి ఎత్తి బెదిరించింది.

అది కదలేదు. ముందు కాళ్ళ మీద నిలబడి, గుట్కా నములుతున్నట్టూ దవడ కదిలిస్తూ ఉంది. పైగా తనని చూసి చిలిపిగా నవ్వినట్టూ కూడా అనిపించింది...

దాంతో ఆగ్రహం అధికమై ఆవేశంగా అడుగు ముందుకు వేసింది. అది బెదరలేదు సరికదా, ముందు కాళ్ళ మీద మరింత పైకి లేచి ఆమె వైపు 'రా. రమ్మన్నట్టు' చూసింది.

ఆమె స్తబ్దంగా నిలబడి గుండెల్నిండా గాలి తీసుకుంది. అది కూడా అలాగే చేసింది.

కౌబాయ్ సినిమాల్లో పిస్టల్ పేల్చటానికి ముందు హీరో, విలన్లు ఎదురెదురుగా నిలబడి నట్టూ ఇద్దరూ సిద్ధంగా నిలబడ్డారు.

అంతలో ఆ మూషికం ఎడమ కన్ను కొట్టింది.

లలితాదేవికి షాక్ కొట్టింది.

అవును చదువరీ... అది కన్ను కొట్టింది.

జూకా మగ ఎలుక.


లలితాదేవి ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసింది.


అది ఈసారి కుడి కన్ను కొట్టింది!

దాంతో వళ్ళు మండి, వంగి ఫ్లవర్‌వేజ్ తీసుకుని మళ్ళీ విసిరింది.

అది గాలిలో రాకెట్ లా తన వైపు వస్తూ ఉండగా, ప్రత్యర్థి ఆటగాడు బంతిని రివర్స్ కిక్ కొట్టినట్టు, జూకా గాలిలో వెనక్కి తిరిగి ఎడమ కాలితో ఫ్లయింగ్ కిక్ ఇచ్చింది.

**(సశేషం)**






**శ్రీమతి అన్నం భాగ్యవతి స్మారక పురస్కారం**

# కార్టూన్ పోటీ ఫలితాలు

**అందరూ విజేతలే!**

ఈ సంవత్సరం మేము నిర్వహించిన బాచి, సోమయాజుల స్మారక కార్టూన్ల పోటీకి అపూర్వ స్పందన లభించింది. సాధారణంగా ప్రతి సంవత్సరం ఈ పోటీలకి ఓ 50 మంది కార్టూనిస్టులు పాల్గొని ఓ 60 కార్టూన్లు పోటికి పంపడం జరిగేది. ఈసారి ఆరవ సంవత్సరం నిర్వహించిన ఈ పోటీలకి బాచి అవార్డుకి 211 కార్టూన్లు, సోమయాజులు అవార్డుకి 150 కార్టూన్లు పరిశీలనకు వచ్చాయి. అందువలన బహుమతి ఎంపికకు న్యాయనిర్ణేతలకు ఒకింత పరీక్ష పెట్టింది అనవచ్చు.


బహుమతులకు అర్హమైన కార్టూన్‌లు అనేకం వచ్చాయి. కానీ బహుమతులు బాచి అవార్డుకి 15... మరియు సోమయాజులు అవార్డుకి ఎనిమిది మాత్రమే ఉండడం వలన కొన్ని కార్టూన్‌లు మాత్రమే బహుమతులు పొందాయి. కొన్నింటికి బహుమతులు ప్రకటించలేకపోయినందుకు నిర్వాహకులుగా మేము, న్యాయనిర్ణేతలు కించిత్ బాధపడిన విషయం మాత్రం వాస్తవం.

ఇకపోతే ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన హాస్యానందం (మన) రాముగారికి... ప్రముఖ కార్టూనిస్టు శ్రీ మురళీధర్‌గారికి మా ప్రత్యేక ధన్యవాదాలు....


పోటీలో పాల్గొని బహుమతులు పొందిన కార్టూనిస్టు మిత్రులకు మరియు పోటీలో పాల్గొన్న కార్టూనిస్టులందరికీ మా ప్రత్యేక శుభాకాంక్షలు మరియు అభినందనలు.

**-బాచి & రమణ**


**మొదటి బహుమతి రూ.5000/-లు పొందిన కార్టూన్**





**రెండవ బహుమతి రూ.3,000/-లు పొందిన కార్టూన్**





**మూడవ బహుమతి రూ.2000/-లు పొందిన కార్టూన్**





## జ్యూరీ బహుమతులు పొందిన కార్టూన్లు...ఒకో కార్టూన్‌కి రూ.500/-లు నగదు బహుమతి






**హా**స్యానందం సౌజన్యంతో నిర్వహించిన- బాచి పురస్కారం, సోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక పురస్కారం, కార్టూన్ పోటీలు- **ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీబాచిగారు, ఎమ్.వి.రమణగారు** నిర్వహించారు.


ఈ పోటీల్లో పాల్గొన్న కార్టూనిస్టులందరికీ అభినందనలు. విజేతలకు శుభాకాంక్షలు.


కార్టూనిస్టులను ప్రోత్సహిస్తూ నిర్వహిస్తున్న పోటీ నిర్వహకులకు హృదయ పూర్వక అభినందనలు.


**-ఎడిటర్**


**యువ కార్టూనిస్టులకు ప్రత్యేక బహుమతులు ఒకో కార్టూన్‌కి రూ.500/-లు నగదు బహుమతి**


**చదువుకుంటున్న విద్యార్థి, విద్యార్థినులు ఎక్కువ సంఖ్యలో ఈ సారి పోటీలో పాల్గొన్నారు. వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 'యువ కార్టూనిస్టులు కేటగిరిలో ఈ ఐదు మంది పిల్లలకు బహుమతులు ఇవ్వడం జరిగింది.**







## మొదటి బహుమతి రూ.2,500/-లు పొందిన కార్టూన్





## రెండవ బహుమతి రూ.1,500/-లు పొందిన కార్టూన్




## మూడవ బహుమతి రూ.1000/-లు పొందిన కార్టూన్






## జ్యూరీ బహుమతులు పొందిన కార్టూన్లు...ఒకో కార్టూన్‌కి రూ.500/-లు నగదు బహుమతి







## జ్యూరీ బహుమతులు పొందిన కార్టూన్లు...ఒకో కార్టూన్‌కి రూ.500/-లు నగదు బహుమతి




శ్రీ ఎస్.వి.రమణగారు వారి తల్లి దండ్రులు **శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి** గార్ల పేరిట ప్రతి సంవత్సరం ఒక కార్టూనిస్టుకి సత్కరిస్తూ, **శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక అవార్డు బహూకరిస్తున్నారు.**

## సరస్వతి మెమోరియల్ అవార్డు

**పర్యావరణ పరిరక్షణ-కార్టూన్ పోటీలో**

1000 రూపాయలు బహుమతి పొందిన కార్టూన్



## శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక అవార్డు-2024 గ్రహీత-

ప్రముఖ కార్టూనిస్ట్ **శ్రీవాడ్రేవు శ్రీనివాస్**


సుమారు **32** ఏళ్ళ నుండి కార్టూన్లు వేస్తున్న **శ్రీవాడ్రేవు శ్రీనివాస్**

**1985**లో ఆంధ్రప్రభలో మొదటి కార్టూన్ అచ్చయ్యింది. ఇప్పటిదాక ఐదువేలకు పైగా కార్టూన్లు వివిధ పత్రికల్లో ప్రచురించబడింది.

సరికొత్త సరదా శీర్షిక

# వాక్చిత్రం

సుధామ-9849297958



## గి'రాఖీ'

**మీ**కు మా కళాకృష్ణ గురించి చెప్పలేదు కదా!... ఆఫీస్‌లో తన టేబుల్ ముందు కుర్చీలో ఎప్పుడూ ఓ స్త్రీ కూచుని ఉండడం తన ఫిలాసఫీ యత్నం!

అతనిది కళా 'తృష్ణ'. ఆ కళ ఏమిటో మరి వేరు చెప్పాలా?

'రాఖీ' తెలుసా? అని అడిగారనుకోండి. 'ముకద్దర్ కా సికిందర్ సినిమాలో అమితాబ్ జోడీగా నటించిన హీరోయినే కదా!...' అంటాడు. ఎప్పుడూ ఆఫీసుకు సెలవు పెట్టని మహానుభావుడయిన తను శ్రావణ పౌర్ణమికి మటుకు కచ్చితంగా ఆఫీసుకు సెలవు పెట్టేస్తాడు.

జంధ్యాల పూర్ణిమ కదా జంధ్యం మార్చుకోడానికి అనుకుంటు న్నారేమో! అదేంకాదు! జంధ్యం వున్నది వీపు గోక్కోడానికి మాత్రమే అన్న టైపు వాడిది. వాడి 'గోకుడులు' వేరు.

వాడి దృష్టిలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సంకెల-'రాఖీ!'

ఇంతకీ ఆ రోజు ఆఫీసుకు సెలవెందుకంటారేమో!... ఆఫీసులో మహిళా ఉద్యోగినులు ఎవరయినా తన చేతికి 'రాఖీ' కట్టేస్తారేమోనని వాడి భయం! కృష్ణుడు కదా! కన్నయ్య అంటే పర్లేదు కానీ ఎవరైనా 'అన్నయ్య' అంటే గింజుకుపోతాడు. తెలిసిందిగా! ఎవరయినా చేతికి 'రాఖీ' కట్టేస్తారేమోననే వాడు రాఖీ రోజు ఆఫీసుకు రాడు.

వాడికి 'పూజ' ఇష్టమే! 'సంధ్యా'వందనం రోజు ప్రేమగా చేసేవాడే కానీ ఆ 'సంధ్య' అన్నయ్య అని పిలిచిందని మానేసి... 'గాయత్రి'ని పట్టుకున్నాడు. జంధ్యాల పూర్ణిమ అన్నా వాడికి ఇష్టమే! ఆ పూర్ణిమ అనే అమ్మాయి యింటి పేరు జంధ్యాలలెండి! రక్షాబంధనం అంటే హీరోచితంగా అమ్మాయిలకు రక్షగా నిలిచే బంధం ఇష్టం కానీ ఈ చేతులకు సూత్రాలు కట్టడం వాడికి నచ్చదు.

మంగళసూత్రం తప్ప మరేదీ వాడి దృష్టిలో సూత్రమే కాదు.

రాఖీ అంత ఘోరమైన పండుగ మరోటి లేదంటాడు. భారతదేశము నా మాతృభూమి. భారతీయులందరూ నా సోదర సోదరీమణులు... అన్న ప్రతిజ్ఞలో వాడు స్కూలు రోజుల్లోనే రెండవలైన్ పలికేవాడు కాదుట. మనకు దేవుడు ఏ అమ్మాయిని రాసిపెట్టాడో తెలియనప్పుడు వాళ్ళందరినీ అక్కచెల్లెళ్ళుగా భావించడం అంత పొరపాటు మరోటి లేదనేది వాడి సిద్ధాంతం!


సరే! వాడికి చెల్లెళ్ళు లేరా?... అని అడుగుతున్నారా!... లేకేం ఇద్దరున్నారు. ఒకరు అక్క కూడా ఉన్నారు. కానీ వాళ్ళు రాఖీ కట్టడం కూడా వాడికి నచ్చదు. రాఖీ కడితే వాళ్ళకి ఏదో బహుమతి ఇవ్వాలి కదా! ఆ బహుమతులు ఇవ్వడం అదీ సరికాదని వాడి మాట!

'కానుకలతో స్నేహితులను కొనవద్దు' అని సూక్తి ఉటంకిస్తూ ప్రేమ అనేదానికి ఏదో బహుమతి ఇవ్వడం అనే లింక్ సరికాదు అని వాదిస్తాడు. 'అక్కా! నువ్వు నాకంటే పెద్ద దానివి. నీకు నేనేమివ్వగలనే! నీ తమ్ముడిగా నువ్వే నాకేమైనా ఇవ్వు' అని అక్కతో అంటాడు.

"అనవసరంగా డబ్బులు ఖర్చు పెట్టి ఆ రాఖీలు అవీ కొనడం ఎందుకే!" అని చెల్లెళ్ళతో అనేసి... రాఖీ కట్టించుకోకుండా కానుకలు ఎగ్గొట్టేస్తూంటాడు. ఒకవేళ వాళ్ళు కట్టినా వాళ్ళావిడ చేసిన ఏ మైసూర్ పాక్ ముక్కో, పాయసమో తినిపించి... 'నోరు తియ్యన చేయడమే ముఖ్యమర్రా!' అని సరిపెట్టేస్తాడు.

వాళ్ళావిడ చేసిన అన్న మాట చదివాక కళాకృష్ణకు పెళ్ళయిందని మళ్లీ విడిగా చెప్పనక్కరలేదు కదా! రాఖీ పండుగకి వీలయితే వాళ్ళావిడ చెల్లెలూ వాళ్ళని ఇంటికి పిలవమంటాడు. "మీ చెల్లెల్ని రమ్మను ఇవాళ రాఖీ పండుగ కదా!" అంటాడు వాళ్ళావిడతో.

అక్క కోసం ఆ చెల్లెలు వస్తే మరదలితో సరదాగా కబుర్లాడవచ్చని వాడి ప్లాన్. అది వాడి కళా'తృష్ణ' మరి!




రాఖీని తిరగేసి 'ఖీరా'ని ఇష్టపడతాడు. శ్రావణి, పూర్ణిమ ఇలా... అమ్మాయి పేర్లతో వుంటుంది కాబట్టి ఈ పండుగ వాడికిష్టం అంతే!

ఓమాటు కుటుంబ నియంత్రణకు... వాడో సలహా ఇచ్చాడు చూసారూ- అది రాఖీ గురించి వాడి భావాలకు పరాకాష్ఠ. ఇంక పిల్లలు వద్దనుకున్నాక భార్య - భర్త చేతికి రాఖీ కట్టేయాలంట. దట్సాల్!! అప్పట్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న మగవాళ్ళకి జీతంలో ఓ అదనపు ఇంక్రిమెంట్ ఇచ్చేవారు. వాళ్ళావిడ చేత రాఖీ కట్టించుకుని వాడు ఆ ఇంక్రిమెంట్ పట్టేసాడు.

అన్నాచెల్లెళ్ళ అనుబంధానికి రాఖీ - ఓ ఖరారు.

అమ్మాయిలను ప్రేమించే కళాకృష్ణలకు మాత్రం-పరారు!

అదండీ వాక్'చిత్రం'!!

ముళ్లపూడి హాస్య కథల పోటీలో
బహుమతి పొందిన కథ

# అక్షర స్వయంవరం





పోలాప్రగడ జనార్ధనరావు
(జెన్ని)
9849142361


"డాడీ!... నేను మా ఆఫీసులో పనిచేసే అక్షర్ని లవ్ చేసా... పెళ్లి చేసుకుందాం అనుకుంటున్నాం." సిగ్గుతో మెలికలు తిరుగుతూ చెప్పాడు బుద్ధేశ్వర్రావు.


"నువ్వు ప్రేమించిన అమ్మాయి, మన సాంప్రదాయం ప్రకారం అదే ఏ బి సి డి ఫార్ములాకి అనుగుణంగా వుంటేనే నేను మీ పెళ్ళికి ఓకే అంటా." గణేశ్వర్రావు కొడుక్కి తన అభిప్రాయాన్ని గట్టిగా చెప్పాడు.

"డాడీ! నువ్వు కొత్త ఫార్ములాలు కనిపెట్టి నా పాలిట విలన్ అవకు! ఫార్ములా డిటైయిల్స్ నువ్వు చెప్పు. అక్షర వాటికి సరిపోతుందో లేదో నే చెబుతా!"

"మొదటిది 'ఏ' అంటే ఏజ్. ఆ అమ్మాయి వయస్సులో నీ కంటే చిన్నదై వుండాలి. అప్పుడే వృద్ధాప్యంలో నీకు సేవ చెయ్యడానికి ఓపికా, బలం వుంటాయి."

"ఓస్! ఇంతేనా? అక్షర నాకంటే చిన్నది. డేట్ ఆఫ్ బర్త్ వెరిఫై చేసా...కమాన్ తర్వాత."






"బి' అంటే బ్యూటీ. ఆ అమ్మాయి కూడా అందంగా వుంటే మీ పిల్లలు అందంగా పుడతారు... ఫలానా వారి మనవలంటే నాకు గర్వంగా వుంటుంది." ఉన్న నాలుగు వెంట్రుకలు దువ్వుకుని... గణేశ్వ్రావు అందంగా నవ్వాడు.

"ఆ విషయంలో నువ్వు అనుమానపడకు డాడీ! అక్షర అదిలాబాద్ అందగత్తె!...తర్వాత కండిషన్ వదులు!"

"ఇది వదుల్ది కాదు. గట్టిది. ఇక 'సి' అంటే క్యాస్ట్... ఆ అమ్మాయి మన కులం అమ్మాయే అయితే మన పూజలు పునస్కారాలు, ఆచార వ్యవహారాలు, ఆహార నియమాల్లో బేధాభిప్రాయాలుండవు!.... రావు!!!"

"గుడికి, హెూటల్‌కి తీసుకెళ్ళి అక్షర అభిరుచుల్ని అబ్జర్వ్ చేసా!... అన్నీ మనకి అనుకూలమే.... నసపెట్టక 'డి' సంగతి తేల్చు."

చెప్పడానికి కాస్త తటపటాయించి తప్పనిసరై చెప్పాడు.

'డి' అంటే దవురీ. బతకడానికి డబ్బు చాలా అవసరం.... ఈ రోజుల్లో కట్నం లాంఛనం కాదు.... నిత్యావసరం!"

"ఆ విషయంలో నువ్వు లెక్కలేయకు డాడీ! లెక్కకు మించిన ఆస్తిపరులు వాళ్ళు. అక్షర కోట్లకి అధిపతి అయిన మా మావగారి ఏకైక కూతురు... డాడీ! మీ తరం 'ఏబిసిడి' ఫార్ములా దగ్గరే ఆగిపోయింది.... మా తరం రెండాకులు ఎక్కువ చదివి ఇ, ఎఫ్ వరకు... పాకి ఫాలో అవుతోంది."

"ఇ, ఎఫ్, అంటే?" గణేశ్వ్రావు గొణిగాడు.

'ఇ' అంటే ఎడ్యుకేషన్. అక్షర నాకన్నా ఎక్కువ చదువుకుంది. సాఫ్ట్‌వేర్ ఎగ్జిక్యూటివ్. ఇహ 'ఎఫ్' అంటే ఫ్యామిలీ. అక్షరకి ఇద్దరు పిల్లలు. పిల్లల్ని కనడానికి నేనింక కష్టపడక్కర్లేదు... నీకు తెలుగు అక్షరాలు గుర్తుకు రాక పోవడం నా అదృష్టం. వచ్చుంటే యాభై ఆరు వివరాలు ఇవ్వాల్సి వచ్చేది."

గణేశ్వ్రావు గొంతు పోడారి... గుడ్లు తేలేసాడు.

గత ఐదు సంవత్సరాలుగా
హాస్యానందం పాఠకులని అలరించిన
**'తర్కారావ్ కథలు'**కి శుభం కార్డు వేస్తూ....
అంతకు మించిన హాస్యంతో....
మిమ్మల్ని నవ్వులతో ముంచెత్తే
సరికొత్త హాస్యకథ శీర్షిక...
**గంగాధర్ వడ్లమన్నాటి** కలం నుండి...
Reverse Gear
వెనక్కి వెళ్ళే కథలు
సెప్టెంబర్ (వచ్చే) సంచికలో ప్రారంభం!

**ముళ్లపూడి హాస్య కథల పోటీలో బహుమతి పొందిన కథ**

# సంసార సర్వస్వం





ద్విభాష్యం రాజేశ్వరరావు
9440318415

**నేను ఆఫీసుకు వెళ్తూ... మా 'గేటెడ్ కమ్యూనిటీ' సెక్యూరిటీ రూమ్ గోడకు ఉన్న పెద్ద నోటీసు బోర్డు దగ్గర ఆగాను!**

**'కమ్యూనిటీ రెసిడెంట్స్'లో కొంతమంది కారు పెట్రోలు ఖర్చు సర్దుబాటు నిమిత్తం... కొంత ఛార్జి తీసుకుని, నెలవారీగా తమ కారులో లిఫ్ట్ ఇస్తూ ఉంటారు. అటువంటి కార్ల వివరాలు నోటీస్ బోర్డులో పెడతారు!**


**మళ్లీ నెల ఒకటో తారీకు నుండి నేను అటువంటి పూల్ కారులో వెళ్ళవలసిన అవసరం ఏర్పడింది!**


అందుకని మా కంపెనీ ఉండే ఎలక్ట్రానిక్ సిటీ వైపుకు వెళ్లే ముగ్గురు కారు ఓనర్ల పేర్లు, ఫ్లాట్ నెంబర్లు, సెల్ నెంబర్లు ఓ కాగితం మీద రాసుకుని ఆఫీస్‌కి వచ్చేసాను.


ఆ మూడు కార్ల యజమానుల ముఖాలు తెలుసును కానీ పర్సనల్ వివరాలు, ముఖ్యంగా వారి కార్ల కండిషను ఏమీ తెలియదు... ఆ వివరాలు తెలుసుకోవాలి. ఎలా?! అంతలోనే మిత్రుడు సన్యాసిరావు గుర్తుకొచ్చాడు.

సన్యాసిరావు ట్రాక్టర్లు, ట్రక్కులు, లారీలు, కార్లు మొదలైన వాహనాలు కొనేందుకు అప్పు ఇచ్చే ఓ పెద్ద ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా ఉన్నాడు! సాలీనా వందకోట్ల పైచిలుకు టర్నోవర్‌తో నడిచే ఆ ఆఫీసు బిల్డింగు, మా ఆఫీస్ పక్కనే ఉంది! వాడికి ఫోన్ చేసి, నా సమస్య చెప్పాను!

వాడు చిన్నగా నవ్వేస్తూ... "లోకంలో అన్ని కంప్యూటర్లూ విజ్ఞాన సర్వ స్వాలు! కానీ మా ఫైనాన్స్ కంపెనీ ఆఫీసులో కంప్యూటర్లు మాత్రం సంసార సర్వస్వాలు!... లంచ్ టైంలో మా






ఆఫీస్‌కి రా!... నీ సమస్య తీరిపోతుంది!" అన్నాడు.

ఒంటిగంటకు బయలుదేరి వాళ్ళ ఆఫీస్‌లోని వాడి ఛాంబర్‌కి వెళ్ళాను.

నేను వెళ్ళగానే కంప్యూటర్ దగ్గర నుండి లేస్తూ... "నీకు కావలసిన యాప్ ఓపెన్‌లో ఉంచాను! నీకు వివరాలు కావాల్సిన వాళ్ళ పేరు, సెల్ నెంబరు టైప్ చెయ్!... వివరం వచ్చేస్తుంది!" అంటూ లేచి... "లంచ్ చేసి వస్తాను!..." అంటూ వెళ్ళి పోయాడు.

సావధానంగా కంప్యూటర్‌ముందు కూర్చుని నా జేబులోని వివరాల లిస్టు తీసి ఎదరపెట్టు కొని, అందులోని మొదటి పేరు సుజన్‌లాల్ అంటూ అతని చిరునామా, ఫోన్ నెంబర్ కూడా టైప్ చేశాను.

కొద్ది సెకండ్లలోనే వివరాలు తెరమీద కన బడ్డాయి!

'వీడు బాల నేరస్తుల స్కూల్లో ఏడాది పాటు ఉన్నాడు. వాళ్ళ ఊరి ఎమ్మెల్యే వెనకాల తిరిగి, అనతి కాలంలోనే బాగా డబ్బులు సంపాదించి, ఎలక్ట్రానిక్ సిటీ ప్రాంతంలో ప్రింటింగ్ ప్రెస్ పెట్టి నడుపుకుంటున్నాడు! వీడి పెళ్ళాం వీడు పెట్టే హింసలు భరించలేక రెండు సంవత్సరాల క్రితం పుట్టింటికి వెళ్ళిపోయింది...' అంటూ ఇంకా ఏదో రాసుకుపోతోంది!

"అతని కారు కండిషన్ వివరం చెప్పు!" అంటూ టైప్ చేశాను.

'మారుతి డిజైర్ 2016 మోడల్... ఇంత వరకు రెండు యాక్సిడెంట్లు చేశాడు. దీని మీద బ్యాంకులోను ఇంకా ఆరు లక్షలు ఉంది! వీడి డ్రైవింగ్ లైసెన్స్ ఎక్స్పైర్ అయిపోయి ఏడాది న్నర అయింది!...' తెరమీద కనిపించింది.

తర్వాత నా లిస్టులో రెండో పేరు 'రామావ తారం.వి' అంటూ అతని చిరునామా, సెల్ నెంబర్‌తో సహా టైప్ చేశాను.

రెండుసెకండ్లలోనే వివరం తెరమీదకు వచ్చింది... 'బీటెక్ మెకానికల్ మంచి మార్కు లుతో పాస్ అయ్యాడు... బ్యాంకులోన్ సాయంతో సొంతంగా ఎలక్ట్రానిక్ సిటీ శివా ర్లలో ఓ వర్క్‌షాప్ నడుపుతున్నాడు. బ్యాంకు 'లోన్' చాలా వరకు తీర్చేసాడు. సెకండ్ సెట్ అప్ ఉంది. పెళ్ళాంతో నిత్యం గొడవలు పడు తూంటాడు... వీడి పేరున మూడు కార్లు ఉన్నాయి. ఒకటి వాడికి, రెండోది భార్యకి, మూడోది సెకండ్ సెటప్‌కి! వీడి కారు 2021 స్విఫ్ట్! మంచి కండిషన్‌లో ఉంది!'

తర్వాత నా లిస్టులోని మూడో పేరు, వివ రాలు టైప్ చేసాను!

'ఉత్తి లోఫర్‌గాడు! దొంగనోట్లు చలామణి కేసులో జైలుకెళ్ళి రెండేళ్లు ఉన్నాడు! ఎలక్ట్రానిక్ సిటీలో ఓ కంపెనీలో సీనియర్ క్లర్కుగా ఉద్యో గం వెలగబెడుతున్నాడు! బాగా తాగుతాడు!... చిలక్కొట్లు అలవాటు విపరీతంగా ఉంది! వీడి పెళ్ళాం కూడా వీడి లాంటిదే!... చీటీ పాటల మీద చాలా డబ్బులు కలెక్ట్ చేసి తినేసింది! కేసులు నడుస్తున్నాయి! ఫైనాన్స్ మీద కారు కొన్నాడు! అది చాలా పూర్ కండిషన్లో ఉంది!' అంటూ వివరాలు వచ్చేసాయి.

"థాంక్యూ కంప్యూటర్!" అంటూ హుషా రుగా నా పేరు, సెల్ నెంబరు టైప్ చేసి పక్కనే నమస్కారం గుర్తుపెట్టాను.

వెంటనే తెరమీద చక చకా వివరాలు వచ్చేసాయి!

'మహా మాయగాడు! టెన్త్‌క్లాసులో స్లిప్పులు రాస్తూ దొరికిపోయి, డిబార్ అయిపోయాడు. ఎమ్మే పరీక్షలు వీడి బదులు ఇంకొకరి చేత రాయించి, డిగ్రీ సంపాదించుకున్నాడు! రెండు లక్షలు ఇచ్చి గవర్నమెంట్‌లో ఉద్యోగం సంపా దించాడు... లంచగొండి! విలాస పురుషుడు! బ్యాంకు ఫైనాన్స్ మీద రెండేళ్ల క్రితం తీసుకున్న కారుకి ఇంతవరకు ఒక్క ఇన్‌స్టాల్‌మెంట్ కూడా కట్టలేదు!... ఈ నెలాఖరులో బ్యాంకు వాళ్లు వాడి కారు సీజ్ చేసి పట్టుకుపోతామని నోటీసు ఇచ్చారు!...' అంటూ ఇంకా ఏదో రాసుకు పోతోంది.

"నీ మొహం తగలెయ్య! చాలు!!... ఇహ ఆపేయ్!! బ్యాంకు వాళ్లు నా కారు పట్టుకు పోయి వేలం వేసేస్తారని నాకూ తెలుసు!... అందుకే కదా లిఫ్ట్ కోసం పూలింగ్ కార్ వివరాలు వెతుక్కోవడం!" అంటూ కంప్యూటర్ పీక నొక్కేసి, కుర్చీలోంచి లేచాను!

ముళ్లపూడి హాస్య కథల పోటీలో
బహుమతి పొందిన కథ

# స్వామీజీ దీవెన





డి.వి.డి.ప్రసాద్
9437094331


**స్నేహితుడు గుర్నాధంతో కలిసి అభయానందస్వామి ఆశ్రమంకి వెళ్ళి అతని దర్శనం చేసుకొని, ముడుపులు చెల్లించి... స్వామీజీ చల్లని దీవెనలు అందుకున్నాడు ఆనందరావు.**


**అతని దీవెనలు నూటికి నూరుపాళ్ళూ నిజమవుతాయని... కోడి లోకమై... అదే... లోకం కోడై కూస్తోంది!**

**తనకిచ్చిన దీవెన కూడా అలాగే నిజమై తీరుతుందని ఆనందరావుకి గట్టి నమ్మకం కలిగింది.**

స్వామీజీ అభయం ఆనందరావు భయాన్ని తొలగించింది. స్వామీజీ ఆశీర్వాదం పొందిన వారం రోజుల్లోనే బెంగుళూరులో మంచి ఉద్యోగం రావడంతో ఆనందరావు సంతోషం పట్టలేకపోయాడు. వెంటనే గుర్నాధంని కలిసి ఆ శుభవార్త పంచుకున్నాడు.

“చూసావా!... ముందు నువ్వు నమ్మలేదుకానీ, అభయానంద స్వామీజీ దీవెనంటే కచ్చితంగా జరిగి తీరుతుంది. ఆరు నూరైనా సరే!... అతని దీవెనలెన్నో నిజమయ్యాయి. నా విషయమే చూడు! నాకు అందమైన అమ్మాయి భార్యగా రావాలని కోరగా దీవించారు. ఫలించింది. కాకపోతే నేనామెకి తగిన జోడీ కాదని ఆమెకో గట్టి నమ్మకం!... అయితే కొన్ని విషయాల్లో






కార్టూనిస్టు చెప్పిన కథలు

హాస్యం, శృంగారం, కరుణ, వీరం,
దుఃఖం, సందేశం, చమత్కారం,
ఆధ్యాత్మికం, వ్యంగ్యం...
అన్ని రసాలు కలిగిన 50 కథల 'రసాలం'!
ఆగష్టు 1న విడుదలైన ఈ 328 పేజీల సంకలనం
వెల కేవలం రూ.200/- మాత్రమే
పోస్టేజి ఉచితం!!
ఫోను- 9440542950


స్వామీజీ దీవెన ఫలించినా... అవి కోరిన వాళ్ళకి ఏమాత్రం లాభించ లేదు." అన్నాడు గుర్నాధం.

"అదెలా?" అర్ధంకాక గుర్నాధం వైపు చూసాడు ఆనందరావు.

"కోటేశ్వర్రావుకి కోట్లకి పడగెత్తాలన్న కోరిక తీరింది... కానీ అతని ఇంటిపై ఆదా యపు పన్ను శాఖవారు దాడి చేసారు. వాళ్ళ కంట పడకుండా కష్టపడి భద్రంగా దాచుకున్న రెండువేల రూపాయల నోట్లు రద్దు అయి, బికారయ్యాడు... అలాగే సుబ్బారావు తనకి బాగా కట్నం లభించే సంబంధం రావాలని కోరుకున్నాడు. స్వామీజీ దీవెన ఫలించి మంచి కట్నంతోపాటు ఆస్తి కూడా దక్కింది. కానీ వాడికి ఆనందం మాత్రం దక్కలేదు ఆనంద రావూ! ఎందుకో తెలుసా? వాడి భార్య పరమ గయ్యాళి!" విశదీకరించాడు గుర్నాధం.

"అందుకే నేనలాంటి కోరికలేమీ కోర లేదు... తెలివిగా కేవలం సుఖశాంతులు లభిం చాలని మాత్రమే కోరాను." నవ్వుతూ చెప్పాడు ఆనందరావు.

"నువ్వు నిజంగా తెలివైనవాడివే, అందుకే తెలివైన కోరిక కోరావు! స్వామీజీ దీవెన తప్పక ఫలిస్తుంది. మరి నాకు విందు ఎప్పుడు?..." అని అడిగాడు గుర్నాధం ఆనందరావు తెలివి తేటల్ని మెచ్చుకుంటూ.

విందు మాటెత్తేసరికి చేదుమాత్ర తిన్నట్లని పించింది ఆనందరావుకి.

ఏదో ఆనందం పట్టలేక తనకి ఉద్యోగం వచ్చిందన్న శుభవార్త అతనితో పంచుకున్నం దుకు, వెయ్యిరూపాయల చమురు వదిలించు కున్నాడు ఆనందరావు.

డబ్బులు ఖర్చవడంతోఆనందరావు మొహం పెసరట్టులా మాడినా... స్వామీజీ దీవెన మహత్యం వల్ల బాధ మాత్రం కలగలేదు.

మంచి ఉద్యోగం రావడంతో ఆనందరావు తల్లితండ్రులు సంతోషించారు.

మరుసటి ఏడు ఆనందరావు ఓ ఇంటి వాడ య్యాడు... అంటే పెళ్ళి ఇంటివాడవలేదు, ఋణం తీసుకొని బెంగుళూరులో ఇల్లు కొను క్కున్నాడు కాబట్టి... అలా ఇంటివాడైయ్యాడు. కానీ ఇప్పటికీ ఒంటరివాడే!

స్వామీజీ దీవెన ఫలించి... ఉద్యోగంలో పదోన్నతులు లభించి రోజులు సుఖ శాంతు లతో గడిచిపోతున్నా, ఆనందరావుకి పెళ్ళి మాత్రం కాలేదు.

పెళ్ళిళ్ళ పేరయ్యలని మార్చినా... వివాహ వేదికలను మార్చినా... ఫలితం మాత్రం శూన్యం. వచ్చిన సంబంధాలు వచ్చినట్లుగానే వెనక్కి వెళ్ళిపోతున్నాయి, తప్పిపోతున్నాయి... ఆనందంగానే బ్రహ్మచారి జీవితం గడుపు తున్నా, ఆనందరావు తల్లితండ్రులు మాత్రం ఇక జన్మలో కొడుకు పెళ్ళి చూడలేమని నిర్ధా రణకు వచ్చేసారు.

బ్రహ్మచర్యం నుండి గృహస్థాశ్రమానికి ఎప్పుడు అతనికి పదోన్నతి లభిస్తుందో తెలి యక సతమతమవుతున్నారు పాపం!

తల్లితండ్రుల ఆవేదన చూడలేక, పోరుపడ లేక వాళ్ళతో కలిసి అభయానంద స్వామీజీ ఆశ్రమానికి వెళ్ళాడు ఆనందరావు ఓ రోజు.

తనవంతు రాగానే, స్వామీజీ వద్దకు వెళ్ళిన ఆనందరావుకి విభూతి ప్రసాదం ప్రసాదించి...

"ఏం నాయనా?" అని అడిగారతను చిరు నవ్వుతో.

"స్వామీ! తమరి ఆశీర్వాద బలంతో సుఖ సంతోషాలతో ఉన్నాను. అయితే, నా పెళ్ళెప్పు డన్న ప్రశ్న నా తల్లితండ్రులకు ఆవేదన కలుగ జేస్తోంది." అని వాళ్ళని చూపించాడు ఆనంద రావు.

వాళ్ళిద్దరివైపు చిరునవ్వుతో చూసి, ఆనంద రావు వైపు తిరిగారు స్వామీజీ.

"నిన్ను నేను ఏమని దీవించాను?" అని అడిగారు స్వామీజీ మందహాసం చేస్తూ.

"జీవితాంతం సుఖసంతోషాలతో వర్ధిల్లమని దీవించారు కదా స్వామీజీ!" భక్తిపూర్వకంగా చేతులు జోడించి చెప్పాడు ఆనందరావు.

"అవును కదా! మరి పెళ్ళైతే సుఖసంతో షాలు ఎక్కణ్ణుంచి వస్తాయి నాయనా! నా దీవెన వమ్ముకాదు... అంటే నీకీ జన్మకి బ్రహ్మ చర్యమే రాసిపెట్టి ఉంది!" అంటున్న అభయా నంద స్వామివైపు వెర్రిమొహం వేసుకొని చూసాడు పాపం ఆనందరావు.

ఆనందరావు తల్లితండ్రులకైతే నోటమాట రాలేదు.

ముళ్లపూడి హాస్య కథల పోటీలో
బహుమతి పొందిన కథ

# చెయ్యి తిరిగితే...


బహుమతి అందుకున్న శ్రీధర్.


ఎన్.డి.ఎస్.వి. నాగేశ్వరరావు,
9987542133


**రవికి కష్టాలు ప్రారంభమై ఆరు నెలలు అయింది.**

**అంటే అంతకు ముందు కష్టాలు లేవని కాదు... ఈ కొత్త కష్టాలు మొదలై, ఆరు నెలలు అయిందని అర్థం అన్నమాట.**

**అందరూ చెప్పేటట్టు 'పెళ్లయిన వెంటనే నా కష్టాలు మొదలయ్యాయి' అని రవి ఎప్పుడూ చెప్పలేదు... ఎందుకంటే వాళ్ళ ఆవిడ రాధ అతన్ని బాగా చూసుకునేది.**

కాస్త మాటకారితనం, నేర్పరితనం ఉండడంతో, ఇంటిపనులు, వంటపనులు, బయటపనులు, బజారు పనులు అన్నీ తనే చేసేసేది. దాంతో రవి ఆఫీస్ పనులు చక్కగా చూసుకుని, ఖాళీ ఉన్నప్పుడు భార్యని అన్ని చోట్లకి తీసుకెళ్లేవాడు.

ఈ రకంగా చూసుకుంటే రవికి కష్టాలు లేనట్లే. కానీ, ప్రేమ తక్కువైనా, ఎక్కువైనా రెండూ ఇబ్బందే! అందుకని ఒక్కోసారి భార్య అతి ప్రేమని తట్టుకోలేక పోయేవాడు.



అయినా సరే 'ఇంత మంచిభార్య దొరకడం తన అదృష్టమే' అని అందరికీ చెప్పుకునేవాడు.


కష్టాలు ఏమైనా ఉన్నాయి అంటే, సమయానికి ఆఫీస్‌కి వెళ్లవలసి రావడం, బాసు ఎప్పుడైనా చివాట్లు పెడితే దులుపుకుని వచ్చేయడం.

రాధ వంట అద్భుతంగా చేస్తుంది.

అంతేకాకుండా కొసరి కొసరి వడ్డిస్తుంది. అందుకే ఏ రోజూ భార్యని వేరే ఊరు, చివరికి పుట్టింటికి కూడా ఒక్కర్తినీ పంపలేదు. అయితే ఇద్దరూ వెళ్లడం, లేదంటే మానేయడం... వీళ్ళ జోడీకి తగినట్టే ఒక కొడుకు, ఒక కూతురు కూడా పుట్టడంతో... కాపురం బహు చక్కగా సాగి పోతోంది. ఒకే సమయంలో పిల్లలకు నచ్చినట్టుగా ఫాస్ట్‌ఫుడ్స్, భర్తకు నచ్చినట్టుగా సాంప్రదాయ వంటకాలు చక్కగా చేసే భార్య ఉండటం రవి అదృష్టం కాకపోతే మరేమిటి?

ఇలా సాగిపోతున్న సంసారంలో అనుకోకుండా కొన్ని సంఘటనలు జరిగిపోయాయి.

అందులో భాగంగానే రవి ఆఫీస్‌లో ఆడిట్ జరుగుతున్న సమయంలో, రాధ ఒక పెళ్లికి తప్పనిసరిగా వెళ్లాల్సి వచ్చింది... మామూలుగా అయితే ఇద్దరూ కలిసి వెళ్లడం అలవాటు. ఇలాంటి పరిస్థితి వస్తే పెళ్లికి వెళ్ళడమే మానేసేవారు... కానీ ఈసారి అలా కుదరని పరిస్థితి... ఎందుకంటే అవతల జరిగే పెళ్లి స్వంత తమ్ముడిలా చూసుకునే చిన్నమ్మ కొడుకుది. అందుకని మూడు రోజులు ఎలాగోలా సర్దుకోమని చెప్పి, రాధ ఊరు వెళ్ళింది.





పిల్లలు కూడా స్కూల్లో పరీక్షలు జరుగుతుండడంతో ఉండిపోవాల్సి వచ్చింది.

జిగ్గీలు, స్వమాటోలు అందుబాటులో ఉన్న కాలం కాబట్టి 'ఏది కావలసినా, ఆర్డర్ చేసుకొని తెప్పించుకోండి' అని చెప్పేసి, ముందు జాగ్రత్తగా కాఫీ డికాషన్లు, రుబ్బిన పిండ్లు, చిరుతిళ్లు... ఇలా అన్నీ సిద్ధం చేసి ఊరు వెళ్ళింది రాధ.

ఎవరో స్వామీజీ చెప్పినట్టు 'కష్టాలు ఊరికే రావు. మనం కోరుకుంటేనే వస్తాయి', అలాగే అయింది రవి పరిస్థితి.


భార్య చెప్పిన మాట విని, కావలసినవి ఆర్డర్ పెట్టుకుంటే... ఈ రోజు ఈ పరిస్థితి వచ్చేది కాదేమో! రవి కాలేజీ చదివే రోజుల్లో, తల్లి తండ్రి ఇంటిదగ్గర లేకపోతే... సొంతంగా వంటలో ప్రయోగాలు చేసేవాడు. అది క్లిక్ అయితే కడుపు నిండేది... లేకపోతే గుమ్మం బయట చెత్త నిండేది. అప్పట్లో అదో సరదాగా ఉండేది.




తర్వాత ఉద్యోగం రావడం, కొంతమంది స్నేహితులతో కలిసి ఇల్లు తీసుకుని వీలైనప్పుడల్లా వంట చేసుకుంటూ ఉండటంతో... అతనికి వంటలో కాస్త చెయ్యి తిరిగింది... అయితే తొందరలోనే పెళ్లి జరిగిపోవడంతో, అతను మళ్ళీ వంటగదిలో ప్రవేశించే అవసరం రాలేదు. ఈ పదిహేను ఏళ్లలో సుమారుగా వంటనే మర్చిపోయాడు. అయినా చక్కగా వండి వార్చే భార్య ఉన్నప్పుడు, వంట గురించి ఆలోచన ఎందుకు?

ఎప్పుడైతే భార్య ఊరు వెళ్ళిందో...

అతని మనసులో కొన్ని లెక్కలు మొదలయ్యాయి. ప్లేట్ ఇడ్లీ ఆర్డర్ చేసుకుంటే కనీసం వంద అవుతుంది... అదే డబ్బులతో మనం వండుకుంటే, కడుపునిండా ఇడ్లీలు వస్తాయి. కాఫీ బయట నుంచి తెప్పించుకుంటే, కనీసం మరో వంద అవుతుంది. అదే మనమే పెట్టుకుంటే, తగినంత స్ట్రాంగుగా, చిక్కగా, తక్కువ ఖర్చుతో అయి పోతుంది. ఒక మనిషికే ఇన్ని లెక్కలేస్తే, ఇప్పుడు ఇంట్లో ఉన్నది పిల్లలతో కలిసి ముగ్గురు. అందుకని ఎప్పుడో తిరిగిన చెయ్యిని మళ్లీ తిప్పాలని నిర్ణయించుకున్నాడు రవి.




అప్పుడే అతని లెక్క తప్పింది.

'అరిటాకు వచ్చి ముల్లు మీద పడినా... ముల్లు వెళ్ళి అరిటాకు మీద పడినా, చిరిగేది అరిటాకే' అన్న విషయం మర్చిపోయాడు.

ఉదయాన్నే లేవాలి... పిల్లలని తయారు చేయాలి. వాళ్ళకి వంట చేసి... క్యారియర్ కట్టాలి. తను ఆఫీసుకు వెళ్ళాలి.

మళ్లీ వచ్చేది రాత్రికి కాబట్టి, రాత్రి వంట కూడా తను ఆఫీసుకి వెళ్లే లోపే, పూర్తి చేసే యాలి. ఇలా నిర్ణయించుకున్న రవి ఉదయాన్నే ఐదుకి, ఐదుంపావుకి, ఐదున్నరకి ఇలా ఒక నాలుగైదు అలారములు పెట్టుకున్నాడు.

మొత్తానికి ఆరు గంటలకు లేచాడు.

చకచకా తను తయారై, పిల్లలని తయారు చేసి, వంట వండి, వాళ్ళకి క్యారియర్ కట్టి, వాళ్ళని స్కూల్‌కి పంపి, తను కూడా క్యారియర్ కట్టుకుని ఆఫీస్‌కి వెళ్ళిపోయాడు.

సాయంత్రం రాగానే మళ్లీ వంట చేసి, పిల్ల లకి వేడివేడిగా వడ్డించాడు... చెయ్యి తిరిగిన మహత్యము ఏంటో తెలియదు గానీ, వంట లన్నీ అద్భుతంగా కుదిరాయి.

ఇదేదో బాగుందని, రెండో రోజు కూడా అదే పద్ధతి ఫాలో అయిపోయాడు.

గోటితో పొయ్యే దాన్ని గొడ్డలి దాకా తెచ్చు కోవడం అంటే ఏమిటో ఆ రోజు తెలిసింది.

ఆ రోజు కాస్త చెయ్యి కాలింది, కాలు మీద పట్టకారు పడింది.

అయినా అవన్నీ పట్టించుకోకుండా... దిగ్వి జయంగా మూడోరోజుకి ముందుకు సాగాడు.

పిల్లలకి కూడా... తాము పుట్టిన తర్వాత మొట్టమొదటిసారి తండ్రి చేతి వంట రుచి చూసి, ఆనంద పడిపోయారు.

'అమ్మ కన్నా బాగా వండావు నాన్నోయ్...' అని ఓ కితాబు ఇచ్చారు.

దాంతో రవి ఆనందానికి పట్టపగ్గాలు లేవు.

ఇదేదో బాగుందని వెంటనే తను చేసిన వంటలు ఫోటోలు తీసి, వాట్సాప్ స్టేటస్ లోనూ, ఫేస్బుక్ పోస్టుల్లోనూ పెట్టేసాడు.

ఆ రంగు, ఆ గార్నిషింగ్ నచ్చేసిన మిత్రు లందరూ థమ్సప్‌లు, ఎమోజీలు పెట్టి సందడి చేశారు.

అంతటితో ఊరుకోకుండా, రవి వాటిని అన్నిటిని స్క్రీన్‌షాట్‌లు తీసి భార్యకి గొప్పగా పంపించాడు.

దొంగతనానికి వెళ్ళినప్పుడు తేలు కుడితే బయటికి అరవకూడదు. ఎందుకంటే తేలు కుట్టిన బాధతో పాటు, చుట్టూ జనాలు చిత క్కొట్టేస్తే బాధ ఇంకా ఎక్కువ అవుతుంది.

అలాంటిది అనుకోకుండా వంట బాగా కుదిరితే, పది మందికి చెప్పుకుంటే, అది ఎటు దారి తీస్తుందో పాపం రవికి ఆ రోజు తెలియ లేదు.

ఇల్లు అలకగానే పండుగ కాదు అన్న సామెత సమయానికి గుర్తు రాలేదు.

నాలుగో రోజు ఉదయానికి రాధ ఇంటికి వచ్చేసింది.

గబగబా తయారయ్యి, వంట మొదలు పెడుతుంటే పిల్లలు...

"అమ్మా! రాత్రంతా ప్రయాణం చేసి అలసి పోయి ఉంటావు. నాన్న నీ కన్నా బాగా వండు తున్నారు... ఈ రోజుకి నాన్న చేత వండిస్తే సరి!" అన్నారు.

ఇన్నాళ్ళ నుంచి వండుతున్న తన వంటని కాకుండా, పిల్లలు తండ్రి వంటని మెచ్చుకునే సరికి, రాధకి ఉక్రోషం పొడుచుకొచ్చింది... అయితే అదే సమయంలో అలసటగా ఉండ టంతో... 'సరేలే' అని రవి వండడానికి ఒప్పే సుకుంది.

ఈసారైనా రవి కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకుని వండి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది.



'కొత్త బిచ్చగాడు పొద్దెరగడు' అన్నట్లు, భార్య దగ్గర వందకి వంద మార్కులు కొట్టేయాలని గట్టిగా ప్లాన్ చేసుకొని, ఆఫీసర్‌కి 'అరగంట ఆలస్యంగా వస్తున్నా' అని కబురు పంపించి, రోజు వండే అన్నం, పప్పు, కూర మాత్రమే కాకుండా, సాంబారు, పచ్చడి కూడా తయారు చేశాడు.

అన్నీ పూర్తి చేసి తన క్యారియర్ కట్టుకుని, ఆఫీసుకి వెళ్ళిపోయి... మళ్లీ సాయంత్రానికి తిరిగి వచ్చాడు.

ఈసారి రాధ వంట పూర్తి చేసి ఉంటుంది కాబట్టి... తను హ్యాపీగా రిలాక్స్ కావచ్చని దృఢంగా నిశ్చయించుకున్నాడు.

కానీ ఇంటికొచ్చేసరికి పరిస్థితి వేరేగా ఉంది.

నిజంగానే పిల్లలకే కాదు రాధకి కూడా రవి వంట బాగా నచ్చేసింది.

అందుకే వంటకి కావాల్సినవన్నీ సిద్ధం చేసి, అతను రావడం కోసం వీధి గుమ్మంలో ఎదురు చూస్తోంది.

ఆమె ఎదురు చూడడాన్ని మరోలా అర్థం చేసుకున్న రవి... ఇంట్లోకి వచ్చాక పరిస్థితి తెలుసుకొని బెంబేలెత్తిపోయాడు.

ఆ రోజు మొదలైన కష్టాలు, ఆరు నెలలైనా తీరలేదు.

ఈ మధ్యకాలంలో రవి కుటుంబంలోని ఏ ఫంక్షన్‌కీ హాజరు కావడం లేదు.

ఎందుకంటే రాధ ఒక్కర్తే ఫంక్షన్లకి అటెండ్ అవుతూ... పిల్లల బాధ్యతలు... రోజు వారీ వంట బాధ్యతలు రవికి వదిలేసింది.

అతని ఫేస్బుక్ పోస్టులు చూసిన చుట్టాలంతా కూడా ప్రత్యేకంగా అతని వంట తినడానికి వాళ్ళ ఇంటికి రావడం మొదలుపెట్టారు.

'ఇంట గెలిచి రచ్చ గెలవడం' అంటే ఇదేనా అనుకున్నాడు.

రాధ కూడా అతనికి ఇతోధికంగా సాయం చేస్తూ, అతని పేరు ప్రఖ్యాతులు నిలబడేలా, బియ్యం కడగడం, కూరలు తరగడం లాంటి పనుల వరకు మాత్రమే చేసి ఆగిపోతోంది. ఎందుకంటే, తన భర్తని అందరూ మెచ్చుకుంటే భార్యకు ఎప్పుడూ సంతోషమే కదా!

రవి ఈ మధ్యనే ఆఫీసులో మగవాళ్ళందరికీ వంటల మీద స్పెషల్ క్లాసులు తీసుకుంటున్నాడు.

అదే సమయంలో వంట బాగా చేస్తే వచ్చే ఇబ్బందులు ఏంటో వాళ్లకి అర్థమయ్యేలా చెప్పే ప్రయత్నం చేస్తున్నాడు.

కానీ వంట నేర్చుకునే వారే తప్ప, ఆ ఇబ్బందుల గురించి పట్టించుకున్న వారు ఎవరూ కనిపించట్లేదు.

ఏమిటో వీళ్ళందరికీ ఎప్పుడు తెలుస్తుంది 'వంటలు ఊరికే రావు. వాటితో పాటు కష్టాల్నీ తీసుకొస్తాయి' అని.

పెనం మీద నుంచి పొయ్యిలో పడటం అంటే ఇదేనని ఎందుకు తెలుసుకోవడం లేదో!!







ఇది నా మొదటి కార్టూన్ల సంకలనం
ఇందులో అన్నీ సరికొత్త కార్టూన్లే ఉంటాయి..
ఇంటిల్లిపాదినీ నవ్విస్తాయి.
అందుకనే నవ్వులు గ్యారెంటీ అని పేరు పెట్టడం జరిగింది.
సుమారు నాలుగున్నర దశాబ్దాలుగా
వివిధ భాషల్లో, దాదాపు అన్ని పత్రికల్లో
కార్టూన్లు వేస్తున్న నాకు మీరంతా అందించిన
ప్రోత్సాహం మరచిపోలేనిది.
మీ పిల్లలకి తెలుగు చదవడం మరియు నవ్వడం నేర్పించండి
ఇందులో ప్రచురించిన కార్టూన్లన్నీ వివిధ
సంఘటనల మీద, వ్యక్తుల మీద, మనుషుల మీద
మనసుల మీద వేయడం జరిగింది.
ఎవరినీ నొప్పించవు. అందరూ చక్కగా ఎంజాయ్
చేయవచ్చు. మీరు అన్ని ఫంక్షన్లలో బహుమతిగా
కూడా ఇవ్వవచ్చు..మరి కొని చదువుతారుగా!..
మీ Nagisetty..

ఊరికే వచ్చిన పుస్తకంలో మజా ఏమీ ఉండదు..
కొని చదివితే వచ్చే ఆ కిక్కే వేరప్పా!..
అందుకే అందరికీ అందుబాటులో దీని ధర
కేవలం రూ.150/- మాత్రమే పెట్టడం జరిగింది.
చాలా తక్కువ కదూ!..
ఇప్పుడే ఈ మొత్తం 9849434550 కి యూపీఐ లో
పంపించి, ఇదే నంబర్‌కి వాట్సాప్ లో మీ పూర్తి చిరునామా పంపండి.
అది చాలు..మరునాడు మీ ఇంట్లో నవ్వులు ప్రత్యక్షం..
"ఈ పుస్తకంలోని బొమ్మలతో మీ పిల్లలు కార్టూన్లు వేయడం నేర్చుకోవచ్చు
నా పుస్తకం కొని చదివే మిత్రులు ఎంతమంది ఉన్నారో చూద్దాం!..

ముళ్లపూడి హాస్య కథల పోటీలో
బహుమతి పొందిన కథ





పద్మ పైడిమర్రి,
7675045608

# భామా కలాపం

**కృష్ణకు, సత్యభామకు, ఈ మధ్యనే పెళ్లి అయ్యింది.**

**పెద్దలకు ఇష్టం లేక పోవడంతో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు.**

**ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తులే కావడంతో, డబ్బులకు పెద్దగా ఇబ్బంది లేదు కాబట్టి తొందరగానే సొంత ఇల్లు అమర్చేసుకున్నారు... కొంచం వూరికి దూరంగా.**

ప్రేమ వివాహం, అందునా రిజిస్టర్ మ్యారేజ్... చుట్టాలు ఎవరినీ పిలవడానికి అవ లేదు కాబట్టి గృహప్రవేశానికి అందరినీ ఆహ్వానించారు కృష్ణ, సత్యభామ.

గృహప్రవేశానికి వచ్చిన కృష్ణ తల్లి రేవతికి కోడలి పద్ధతి, మర్యాద నచ్చినా... తన ప్రమేయం లేకుండా పెళ్లి చేసేసుకున్నారని కొంచం కినుకగా వుంది కోడలిమీద.

కృష్ణకి మటుకు భామ అంటే ప్రాణం.

ముఖ్యంగా భామ వాలుజడ పట్టుకుని ఆమె వెనకాలే తిరుగుతూ పనుల్లో సహాయం చేయడం చాలా ఇష్టం.

అత్తగారు వున్నారు వద్దని చెప్పినా కృష్ణ వినేవాడు కాదు.


కృష్ణ తల్లి రేవతికి ఇది నచ్చడం లేదు.

చూసారా నా కొడుకుని ఎలా కొంగున కట్టేసుకుందో అంది కోపంగా భర్తతో.

కొంగుకు కాదే వాలుజడకి అన్నాడు నవ్వుతో.

కృష్ణా, భామ అన్ని ఏర్పాట్లు చక్కగా చేసుకుని వచ్చిన అతిథులు అందరినీ మర్యాదగా పలకరిస్తూ... గృహప్రవేశం పూర్తి చేసుకుని అందరినీ భోజనాలకు ఆహ్వానించారు.

వచ్చిన వాళ్ళు అందరూ భోజనాలు కానిచ్చి... కాసేపు కబుర్లు చెప్పుకుని సాయంత్రం



నాలుగు అవ్వగానే ఇళ్లకు వెళ్ళడానికి బయలు దేరారు.

ఇంతలో కృష్ణ, భామని చూసి ఏదో సౌజ్ఞ చేయడం, భామ గదిలోకి వెళ్లడం, వూరుకోండి ఇవాల్టికి వద్దు అందరూ వున్నారు బాగోదు... అని భామ అనడం రేవతి గమనించింది.

ఒక రోజే కదా అని వూరుకున్నామంటే మనకి తరువాత... చాలా ఇబ్బంది అయి పోతుంది. నా వల్ల కాదు అన్నాడు కృష్ణ.


మరి ఇంక మీ ఇష్టం అని బయటకు వచ్చే సింది భామ.

ఇంక అంతే అప్పటినుంచీ కృష్ణ ఎవరైనా వెదుతున్నామంటే చాలు... గబగబా తలుపు తియ్యడం వాళ్ళు గుమ్మం దాటక ముందే తలుపు వేసేసి హమ్మయ్య అని భామ కేసి చూడడం, అది చూసి భామ ముసి ముసిగా నవ్వడం రేవతి చూస్తూనే వుంది.

వీళ్లేంటి ఇప్పటిదాకా అందరినీ మర్యాదగా చూసి అకస్మాత్తుగా ఇలా ప్రవర్తిస్తున్నారు.... అందరూ ఏమనుకుంటారు? అనుకున్న రేవతి భామని పిలిచి– "వాడికి బుద్ధి లేకపోతే నీకే మైందీ?...ఎంత కొత్తగా పెళ్లి అయితే మటుకు ఇలానే ప్రవర్తిస్తారా? ఆ హడావిడి ఏమిటీ?... మొహాల మీదే తలుపులు వేసెయ్యడం ఏమిటీ?" అని నిలదీసింది భామని.

అత్తగారు ఏమంటున్నారో అర్థం కావడానికి భామకి రెండు నిమిషాలు పట్టింది.

వెంటనే వచ్చే నవ్వుని ఆపుకుని... కృష్ణని పిలిచి– "చూడండి! అత్తయ్యగారు ఏమను కుంటున్నారో... మీరు చెబితే వినలేదు!" అంది కోపంగా.



కృష్ణ ఏదో చేప్పే లోపుల రేవతి–

"అనవసరంగా వచ్చాం... మాకే సిగ్గేస్తోంది ఇక్కడ వుండటానికి!" అని విసుక్కుంది కొడుకు మీద, కోడలి మీద.


"అయ్యో అమ్మా! అలాంటిది ఏమి లేదు! ముందు నేను చెప్పేది పూర్తిగా విను. ఈ ఇల్లు వూరికి కొంచం దూరంగా వుంది కదా! ఇక్కడ దోమలు చాలా ఎక్కువ. సాయంత్రం నాలుగు అయితే చాలు సకుటుంబ సపరివార సమే తంగా పిలవకపోయినా మన ఇంటి గుమ్మం లో వుంటాయి... తలుపు తీసామా చాలు, మన అనుమతితో పని లేకుండా లోపలకు వచ్చేసి, ఒకొక్క సిప్పుగా మన రక్తం తాగుతూ, వాటికి వచ్చిన వాయిద్యాలతో రకరకాలుగా తెల్లవార్లూ కచేరీ చేసేస్తాయి మన చెవుల్లో!" అన్నాడు కృష్ణ.

"మరి ఆల్ అవుట్ మిషన్ పెట్టచ్చుగా!?" అన్నాడు కృష్ణ తండ్రి.

"అదీ అయ్యింది మావయ్యా!... అవి మన మీద దాడి చెయ్యడానికి ఆ మిషన్ మీదనుంచే టేకాఫ్, ల్యాండింగ్, చేస్తున్నాయి!" అంది భామ.

"అందుకే అమ్మా! ఈ దోమల బాధ పడ లేక భామని గదిలోకి పిలిచి... అందరూ వెదు తుంటే వెంట వెంటనే తలుపులు వేసేద్దాం అని చెప్పా!...అక్కడికీ భామ వద్దు బాగోదని చెప్పింది. కానీ దోమల బాధ పడలేక నేనే అలా చేస్తున్నా!" అన్నాడు కృష్ణ నవ్వుతో.

"అయ్యో! ఇదా సంగతి... మరి చెప్పారు కాదే... అస్తమానం నువ్వు భామతో మాట్లా డడం, తలుపులు వెయ్యడం, ఆమె నవ్వులూ చూసి, భామాకలాపం అనుకున్నాగాని, దోమా కలాపం అని ఇప్పుడే తెలిసింది!" అంది రేవతి నవ్వుతూ!


ఆహ్వానము

**హాస్యానందం (హాస్యకథా సంకలనం ) పుస్తక ఆవిష్కరణ,**

**ఆగస్టు 10వ తేదీ ఉదయం 10 గంటలకు**

**విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ హాల్లో జరగనున్నది. కావున సాహితీ మిత్రులందరూ,**

**ఈ పుస్తక ఆవిష్కరణకు విచ్చేసి, ఈ సభను విజయవంతం చేయగలరు.**

పౌర గ్రంథాలయం/పబ్లిక్ లైబ్రరీ, ద్వారకా నగర్,

బి. వి. కె. కాలేజీ ఎదురుగా, విశాఖపట్నం.

ముళ్లపూడి హాస్య కథల పోటీలో
బహుమతి పొందిన కథ


బహుమతి అందుకున్న
మౌనికి సుదర్శనం



రంగనాథ్ సుదర్శనం,
9866265630

# పడుచు పెళ్ళాం- సైకిల్ సవారీ

**నాకు పాతికేల్లోచ్చాయి...**

**అన్నింటా శభాష్ అనిపించుకున్న నాకు దిక్కుమాలిన సైకిల్ తొక్కడం మాత్రం రాలేదు!**

**చిన్నప్పుడు ఓ కిరాయి సైకిల్ తీసుకొని అందరిలాగే ప్రయత్నించాను. నా ఖర్మ కొద్ది నేను ముట్టుకోగానే దాని చైను తెగింది. మా నాన్నకు తెలిస్తే చావ కొడతాడని భయపడి, అప్పుచేసి చైను బాకీ చెల్లించాను. నా సరదాలన్నీ మానుకొని... పైసా పైసా కూడబెట్టి ఆ బాకీ తీర్చడానికి నానా తంటాలు పడ్డాను. ఆ దెబ్బతో మళ్ళీ సైకిల్ జోలికి వెళ్లలేదు.**

మరి ఇప్పుడెందుకంటా సైకిల్! అని అనకండి...

నాకు ఈ మధ్యే పెళ్లి ఖాయం అయ్యింది... నాకు కాబోయే భార్యను నీకేమిష్టమని గారంగా అడగటం నా బుద్ధి తక్కువయ్యింది.

“నాకు సినిమాలో హీరో హీరోయిన్‌కు మల్లే నన్ను సైకిల్‌పై ముందు కూర్చొబెట్టుకొని డబుల్ సవారీ చేయించాలి!” అని అడిగింది.

నా గుండెల్లో పిడుగులు పడ్డా నిభాయించుకొని సైకిల్ తొక్కడం రాదంటే పరువుపోతుందని...

“ఓహ్ అంతేనా!... సరే!” అన్నాను.

పెళ్లి చూస్తే దగ్గరలోనే ఉంది! అందుకే సైకిల్ నేర్చుకోవాలని భీష్మ శపథం చేశాను.

నలుగురికి కనపడకుండా గుట్టుచప్పుడు కాకుండా రాత్రుళ్లు నేర్చుకునే ప్రోగ్రామ్ పెట్టాను.

నాకు తోడుగా మా ఎదురింటి బాబ్జీగాడికి ఒక పుల్ల ఐసు, లెమన్ షోడా లంచంగా ఇచ్చి జతచేసుకున్నాను.

ఒక మంచి ముహూర్తాన లుంగీ గోచిలా పెట్టుకొని ఒక ఎత్తైన బండ రాయి ఆసరా చేసుకొని సైకిలేక్కాను.

బాబ్జీ గాడు వెనుక పట్టుకొని బ్యాలన్స్ చేస్తుంటే అష్ట వంకరలు తిరుగుతూ... కొద్ది దూరం పోగానే దబీమని కిందపడ్డాను.



కాళ్ళు చేతులు డోక్కుపోయి... రక్తాలు కారాయి. బాబ్జీ గాడు ఒకటే నవ్వుడు!

అయినా దెబ్బలు తగలకుండా సైకిల్ ఎలా వస్తుంది?... నొప్పిని పంటిబిగువున ఓర్చుకొని మళ్ళీ ఎక్కాను!

ఈసారి జారి బురద పొలంలో పడ్డాను.

బాబ్జీగాడు కడుపు పట్టుకొని ఆగకుండా నవ్వాడు.

ఇన్ని కష్టాలకు కారణం వాడికేం తెలుసు... అని సర్ది చెప్పుకున్నాను.

పట్టుదలగా తెల్లారి మళ్ళీ మొదలు పెట్టాను.

ఇపుడు కాస్తా పర్వాలేదు... పడబోయే ముందు కాళ్ళతో బ్యాలన్స్ చేసి ఆపటం వచ్చింది. మొత్తానికి ఒకవారం రోజుల్లో సైకిల్ తొక్కడం వచ్చింది.

కానీ ఎంత ప్రయత్నించినా... సైకిల్ ఎక్కడం, దిగడం మాత్రం రాలేదు. ఎక్కడానికి దిగడానికి ఓ బండరాయి కావాల్సిందే.

✦✦✦

మొత్తానికి నా పెళ్లయిపోయింది.

రోజూ పడగ్గదిలో నా భార్య సైకిల్ సవారి అడగటం... నేనేదో చెప్పి బుకాయించడం చేశాను. సైకిల్ బదులు మోటార్ సైకిల్ అన్నాను... కారు అన్నాను... విమానం అన్నాను... కానీ ససేమిరా ఒప్పుకోలేదు.

ఆరోజు ఇంట్లో ఎవ్వరూలేరు.

నా భార్య ముచ్చటగా ఈ రోజు ముచ్చట తీర్చమని అడిగింది. ఇక తప్పింది కాదు.

నా జాగ్రత్త కోసం ముందే రూట్ మ్యాప్ సిద్ధం చేసు కున్నాను.

దారిలో ఎక్కడానికి దిగడానికి అవసరమైన రాళ్ళు రోడ్డుపక్కన పక్కగ్గా ఏర్పాటు చేసుకున్నాను. ఊరిలో సైకిల్ ఎక్కడం బాగుండదని ఊరి చివరిదాకా తీసుకెళ్ళి... నా అడ్డా రాగానే నా భార్యను సైకిల్ ఎక్కించుకున్నాను. నా భార్య చేతిలో టేప్ రికార్డర్ పాటందుకుంది 'కుడి కన్ను కొట్టగానే కుర్రాడా...' పాట వెనుక పాట, ముందు పడుచు పెళ్ళాం... నాలో హుషారు పెరిగింది... జోరులో నా అడ్డా దాటి పోయాను. దిగడానికి ఒక్క రాయి కనపడటం లేదు. నాకు చెమటలు పట్టాయి, గుండె లయ తప్పింది... ఇక తప్పదని నా భార్యకు అసలు విషయం చెప్పగానే గట్టిగా బ్రేకులు వేసింది.


ఇద్దరం పక్కనే నీళ్ళల్లో దబీమని పడ్డాం.


తను పక పకా నవ్వింది... ఈ పడిపోవడం కూడా తన ముచ్చటేనని చెప్పింది. విషయం విని... పాపం నా కోసం ఇన్ని కష్టాలు పడ్డారా అని నన్ను గట్టిగా అల్లుకు పోయింది.


హమ్మయ్య... అని గట్టిగా ఊపిరి పీల్చుకున్నాను.

# లాఫింగ్ రాఖీ

పద్మ




# అలా జరిగింది

ముళ్ళపూడి హాస్య కథల పోటీలో బహుమతి పొందిన కథ






కొత్తపల్లి రవి కుమార్,
9491804844

**ఆరోజు మధుబాల, బాలరాజుల పెళ్లి జరుగుతోంది.**

**వీళ్లిద్దరూ రోజుల తేడాలో పుట్టారు.**

**మధుబాల పుట్టినప్పుడే బాలరాజు పెళ్ళాం అని నిశ్చయించేసుకున్నారు... అన్నా చెల్లెళ్లు భాగ్యం, వీరబాబులు.**

**బాలరాజు తండ్రి సూరిబాబు తాగుబోతైనా ఆ లక్షణాలేవీ వంట పట్టించుకోలేదు మన బాలరాజు.**

పైగా బాగా చదువుకుని కేంద్ర సర్కారీలో మంచి ఉద్యోగం కూడా సంపాదించాడు. అందుకే వీళ్లు పుట్టినప్పుడు చేసుకున్న వాగ్దానాన్ని తు.చ. తప్పకుండా పాటించి వాళ్లిద్దరికీ పెళ్లి చేస్తున్నారు.

పెళ్లి పందిరిలో పంతులుగారు తప్ప ఎవరూ లేరు.

అందరూ చాలా గందరగోళంగా అటూ ఇటూ తిరుగుతూ ఏదో వెతుకుతున్నారు.

అప్పుడే పెళ్లికని వచ్చి, ఇదంతా చూస్తున్న గిరిబాబుకి ఏమీ అర్థం కాలేదు.

"ఏం జరుగుతోంది పంతులుగారు? వాళ్లంతా ఎందుకలా ఏదో పోగొట్టుకొన్న వాళ్లలాగా వెతుకుతున్నారు?" అని అడిగాడు.



"ఏం చెప్తాను నాయనా?...ఈ రోజుల్లో అన్నీ వింతలే!... ఇదేదో తాళిహంట్‌ట... తాళిబొట్టును ఎవరికీ తెలియకుండా పెళ్లికూతురు ఒకచోట దాచేస్తుందట. అది పెళ్లికొడుకు వెతికి తీసుకుని రావాలట... అలా తెస్తేనే పెళ్లి చేసుకుంటుందట... ఆ అమ్మాయి ఎక్కడో యూట్యూబ్‌లో చూసి తగలడిందట...



అలా చేస్తేనే తాళి కట్టించుకుంటానని తెగేసి చెప్పింది ఆ పెళ్లికూతురు బడుద్దాయి!... అందుకే ఆ పెళ్లికొడుకు సన్నాసికి వీళ్లందరూ తాళిబొట్టు వెతకడంలో సాయపడు తున్నారు!" అని అసలు విషయం చెప్పారు పంతులుగారు.

"అవునా? భలే ఫన్నీగా ఉంది..." అని తను కూడా ఆ హంట్‌లో పార్టిసిపేట్ చేసాడు గిరిబాబు.

రెండు, మూడు గంటల తర్వాత వెతికి వెతికి అలిసిపోయి ఆయాసంతో కూర్చున్నారు అందరూ.

ఎక్కడా తాళిబొట్టు కనపడకపోయేసరికి ఒకళ్ల ముఖాల్లో ఒకళ్లు వెర్రి చూపులు చూసు కుంటున్నారు.

"ఏమే బాలా! నేను కనుక్కోలేను గానీ ఎక్కడ పెట్టావే చెప్పవే?" అని ఒగురుస్తూ అడిగాడు బాలరాజు.

"అనుకున్నాను... నువ్వు కనిపెట్టలేవని. అదేంటి పెద్ద మగాడ్ని అంటావు.ఆ మాత్రం కనుక్కోలేవా? ఓడిపోయానని ఒప్పుకో చెబుతాను!" అంది మధుబాల.

"ఓడిపోయాను లేవే!... అసలే ముహూర్తం కూడా దగ్గర పడుతోంది. చెప్పవే..." అని ప్రాధేయపడ్డాడు బాలరాజు.

"అదీ...అదీ...మావయ్య అదే మీ నాన్నకి తెలియకుండా ఆయన జేబులో పెట్టాను!" అని చావు కబురు చల్లగా చెప్పింది.

"అవునా! నిజమా! నేనస్సలు ఊహించనే లేదు!" అని బాల తెలివితేటలను మెచ్చుకుని తన నాన్న కోసం చూసాడు బాలరాజు.

అందరూ కూడా చుట్టూ చూసారు.

ఎక్కడా సూరిబాబు కనపడలేదు.

✦✦✦


ఇప్పుడూ అందరూ బార్‌ల చుట్టూ తిరుగుతున్నారు.


సూరిబాబుని పట్టుకోవడానికి.




# చిలిపి చిలుకలు

మురళీధర్



ముళ్లపూడి హాస్య కథల పోటీలో
బహుమతి పొందిన కథ

# వంట వచ్చిన మొగుడు





యలమర్తి అనూరాధ
9247260206

పెళ్లిచూపులు తతంగం జరుగుతోంది.

ఏమైనా ప్రశ్నలు అడగాలని ఉంటే మా అబ్బాయిని అడగవచ్చు అంది పెళ్ళి కొడుకు తల్లి.

వెంటనే "మీకు వంట వండటం వచ్చా?" అని అడిగేసింది పెళ్లికూతురు అమల...అమ్మ్మ!

"ఆc! బాగా వచ్చు!" అన్నాడు పెళ్ళికొడుకు శైలేంద్ర తడుము కోకుండా.

మరి ఇప్పుడు వంట రాని మగాళ్ళను మొగుళ్ళుగా ఎవరూ అంగీకరించటం లేదు... రాదు అంటే తర్వాత మాటలే ఉండటం లేదు... మన పాలిట వరాల్లా వంటల పుస్తకాలు, యూట్యూబ్ ఛానల్స్ ఉన్నాయన్న ధీమాతోనే అలా చెప్పేసాడు.



అతని సమాధానంతో అమ్ము ముఖం వెలిగిపోయింది సూర్యుడిలా.

"హమ్మయ్య!" అనుకుంది మనసులో.

ఎలాగూ తనకు వంట చేసే ఉద్దేశం లేదు. బయటినుంచి తెచ్చుకున్నవి అంత రుచిగా ఉండవు కదా ఇంట్లో చేసినట్లు.

ఈ పని ఆ పని లేదు... ఏ పని అయినా ఇద్దరం కలిసే చేసుకోవాలి అని మరో షరతు పెట్టింది. నేనూ ఉద్యోగం చేస్తున్నానుగా అన్న వాక్యాన్ని జోడిస్తూ.

ఒప్పుకోక తప్పలేదు వాళ్ళకి.

మరి ఏ పెళ్లిచూపులుకు వెళ్లినా ఇలాగే ఉంటున్నాయి మాటలు.

ఒకరోజు మగవాళ్ళ కోరికలకు అమ్మాయిలు బలి అయ్యారు... ఇప్పుడు అదే పాటను అమ్మాయిలు పాడుతున్నారు నీవు నేర్పిన విద్య అని.

కాస్త తట్టుకోవటం అబ్బాయిలకి ఇబ్బందిగానే ఉన్నా పెళ్లి కాని ప్రసాద్‌లా ఉండిపోవటం కంటే ఇదే మేలు అనే రకంగా తయారయ్యారు.

అలా పీటల మీదకి ఎక్కాడు పెళ్లి కొడుకు.

✦ ✦ ✦

పెళ్లి ఘనంగా జరిగిపోయింది.

కాపురం కూడా పెట్టేశారు.

ఒకరోజు నువ్వు...ఒక రోజు నేను... వంట అన్నాడు ముందే ఎందుకైనా మంచిదని ఆ విషయంలో ఒప్పందం కుదుర్చుకోవాలనుకున్నాడు గురుడు.





అంతే! నాగు పాములా బుస్సున లేచింది అమ్ము.

"నీకు వంట వచ్చా అని అడిగింది ఎందుకు?... నేను వంట చేయటానికా!? చిన్నప్పటినుంచీ నాకు వంట అంటే... పరమ చిరాకు. ఆ పని నీదే!" కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేసింది.

ఇక అప్పటినుంచి అతనికి తిప్పలు ప్రారంభమయ్యాయి.

ఒకరోజు ఉప్పు తక్కువ అని... ఓ రోజు కారం ఎక్కువైందని... మరో రోజు ఇంత పుల్లగా ఉందేమిటని... ఇంకో రోజు తీపి చేయలేదా? అని అక్షింతల పరంపర.




వండింది కాకుండా ఈ మాటలు కూడా పడాలా అని మనసులో తిట్టుకున్నా... రాత్రికి ఉపవాసం ఉండాల్సి వస్తుందని రేపు బాగా చేస్తానుగా అనేవాడు.

రేపు అలానే ఆ వంట కూడా వెలగపెట్టేవాడు. మరి వంటింటి ముఖం చూడనివాడు గరిట పట్టుకుంటే ఇలా కాక ఎలా ఉంటుంది?

చివరకు అమ్ముకి అతని వంట అంటేనే విరక్తి వచ్చేసింది.

"అదేదో సంఘం వాళ్ళు వంట నేర్పుతున్నారట! ఓ వారం ఆఫీసుకు సెలవు పెట్టి నేర్చుకొని రా!" అంటూ ఆజ్ఞ వేసింది.

కాదంటే ఎక్కడ విడాకులు అంటుందో అని భయపడి కిం...కం... అనకుండా అక్కడ చేరిపోయాడు.

అయినా వంట చేయడంలో ఏ మార్పు రాలేదు.

✦ ✦ ✦

అమ్ము ఫోన్‌లో స్నేహితురాలితో మాట్లాడుతోంది.

పెళ్లి చూపుల్లో వంట వచ్చా అని అడగకే... ఏదో ఒకటి చేసి చూపించమని అను! బాగా చేస్తే చేసుకో... లేదంటే వద్దని చెప్పేసేయ్! అనుభవంతో చెప్తున్నా... మన తీరు మార్చుకోవాలి అని సలహా ఇస్తోంది.

అది విని తెల్లబోవటం మన అల్లుడు బాబు వంతయింది.

**ముళ్లపూడి హాస్య కథల పోటీలో బహుమతి పొందిన కథ**



బహుమతి అందుకున్న స్రవంతి మోచర్ల



**మోచర్ల అనంత పద్మనాభరావు**
9848607127

# ఉత్తమురాలు

**'శాస్త్రమెప్పుడూ ఏం చెప్పినా నిష్కర్షగానూ, కర్కశంగానూ చెబ్తుంది. మనం సౌమ్యంగా సారాంశమే తీసుకోవాలి... అయినా శాస్త్రాలు సామాన్యులకు గాని, మా కౌరవుల వంటి అసాధారణ అపూర్వ జాతకులకు కాదు....'**

**ఏమిటీ...ఈ మాటలు ఎక్కడో విన్నట్టున్నాయని అనుకుంటున్నారా?... అవునండి! ఇవి పింగళి వారి రసగుళికలు. తెలుగువాడి కీర్తిని నలుదిశల వ్యాపింప చేసిన మహత్తర చిత్రరాజం 'మాయాబజారు'లోనిది. మీకు గుర్తుండే ఉంటుంది. ఈ మాటలు తెలుగువాడికి కంఠోపాఠం.**

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే... ఏ శాస్త్రానికైనా తన కనువుగా భాష్యాన్ని చెప్పుకోడంలో ప్రథముడు తెలుగువాడు. ఎందుకంటే శాస్త్రాలపట్ల, సాంప్రదాయాల పట్ల తెలుగువాడికి ఉన్న నిబద్ధతను తక్కువగా అంచనా వేయలేం. వాటి పట్ల వాడి నమ్మకం అటువంటిది. అలా శాస్త్రానికి, సాంప్రదాయానికి తలొగ్గిన వాళ్ళు కొందరైతే, వాటిని తమకనువుగా మార్చుకునే వారు మరి కొందరు.

అలాంటి వాళ్ళే ఈ వదినా మరదళ్లు.

"ఏమే కామాక్షి!... ఇవాళ ముగ్గు నువ్వేస్తున్నావేంటి?...రమ్య ఏది?" పక్కింటి గోడ మీంచి పార్వతి అడిగింది వాకిట్లో ముగ్గేస్తున్న కామాక్షిని.

పార్వతి, కామాక్షి మేనత్త మేనమామ పిల్లలు. చిన్నప్పటి నుంచి ఒకే చోట పెరిగారు. వాళ్ళిద్దరిని విడదీయడం వాళ్ళ మొగుళ్ళకి కూడా సాధ్యపడలేదు... భర్తల ఉద్యోగరీత్యా ఒకే ఊరులో, ఒకే వీధిలో, పక్కపక్క ఇళ్ళల్లో ఉంటున్నారు. కాపురాలకు గోడ అడ్డొచ్చినా, కబుర్లకు మాత్రం అడ్డుగోడ లేనట్టే.

పార్వతికి ఓ కూతురు సౌమ్య. పెళ్లైంది. అల్లుడు హైదరాబాదులో ఉద్యోగం. ఓ కొడుకు.



విశాఖపట్నంలో చదువుతున్నాడు.

కామాక్షికి రమ్య ఒక్కత్తే కూతురు. జ్యేష్ఠ మాసంలో పెళ్ళయ్యింది. అల్లుడుకి వరంగల్ లో వ్యాపారం. మూడురాత్రుల కోసం వచ్చి ఓ పక్షం రోజులు అత్తారింట్లో హాయిగా గడిపాడు. ఇక ఆషాఢం వస్తోందనగా...శాస్త్రం ప్రకారం అత్తారింట్లో ఉండకూడదనే పట్టింపుకు కట్టుబడి తనింటికి వెళ్లక తప్పలేదు.

"అది సరే... నువ్వెక్కడికెళ్లావు చెప్పా పెట్టకుండా?" పార్వతి ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా ఎదురు ప్రశ్నించింది కామాక్షి.

"అదేమిటే అలా అంటావు... రేపట్నుంచి ఆషాఢమాసం!...అత్తాకోడలు ఒక గడప దాటకూడదని శాస్త్రం కదా?... అందుకని మా వియ్యాలవారు కబురు పెట్టారు. మీ అల్లుడుకి అషాఢ పట్టీ పట్టుకొచ్చి, మీ పిల్లను మీ ఇంటికి తీసుకెళ్ళండి అని."

"అంటే, పెళ్లి ఖర్చు నుంచి తేరుకోకుండానే ఇంకో ఖర్చన్న మాట!"

"ఆ! తప్పుతుందా?... అసలే మా వియ్యాలవారికి పట్టింపులు ఎక్కువ! అందుకే అక్కడకు వెళ్లి ఆ ముచ్చట జరిపించి సౌమ్యను తీసుకొచ్చాం... లేకపోతే ఏకంగా ఏడో నెలలో సీమంతం చేసి పురుడుకు తీసుకొద్దామనుకున్నాం."

"ఇప్పుడు సౌమ్యకు ఎన్నో నెల?"


"ఈ మధ్యనే అయిదొచ్చింది... కడుపుతో ఉన్న పిల్లను అటూ ఇటూ తిప్పడమెందుకూ అనుకున్నా... తప్పలేదు. మొదటి ఆషాఢం కదా! మన పెద్దవాళ్ళు ఎందుకు పెట్టారో ఏమిటో ఈ సాంప్రదాయాలు అవీనూ?... మనం పాటించకపోతే ఎలా?"

"అవునులే!" అంటూ ముగ్గు వేయడంలో మునిగిపోయింది కామాక్షి.

"నేనడిగిన దానికి జవాబు చెప్పకుండా నా చేత వాగించావు. ఇంతకీ రమ్య ఏదీ అనడిగాను. వినిపించిందా?" కొంచెం కోపంగా అంది పార్వతి.

"అత్తారింటి కెళ్ళింది." తల ఎత్తకుండానే సమాధానమిచ్చింది కామక్షి.

"అత్తారింటికా! నీకేమైనా మతిపోయిందా? రేపటినుంచి ఆషాఢమాసం కదా! అలా ఎలా




పంపించావు?"

"ఏం చెప్పమంటావు?... అల్లుడు అమ్మాయిని విడిచి క్షణం కూడా ఉండలేక పోతున్నాడుట. నిన్న ఫోను చేసి వస్తావా? రావా? అని అడిగేసరికి ఇది టింగురంగ అంటూ ఒక్కత్తే వెళ్ళింది. నీకు తెల్సు కదా! అది చాలా మొండిదని... అప్పటికీ మీ అన్నయ్య అంటూనే ఉన్నారు... నేను వచ్చి దిగపెడతానే అని. అబ్బే వింటేగా! రయ్యిమని వెనక్కి చూడకుండా మరీ వెళ్ళింది!"

"పెళ్లైన దగ్గర నుంచి అల్లుడు ఇక్కడే ఉన్నాడుగా! నిన్న గాక మొన్న వాళ్ల ఊరెళ్లాడు... ఒక్కరోజుకే మొహం వాచిపోయాడా? అతను ఫోన్ చేసినంత మాత్రాన మీరెలా పంపిస్తారే? అసలు అదెలా వెళ్ళింది? దానికి బుద్ధి లేకపోతే మీకుండద్దూ?... మన సాంప్రదాయాలు మర్చిపోతే ఎలా?... హవ్వ! ఆషాఢంలో అత్తారింటికెళ్లిన కొత్త కోడళ్లను నేనెక్కడా చూడలేదు... అయినా మంచి, చెడు ముహూర్తం గిహూర్తం చూసుకోవద్దూ?" గింజుకు పోయింది పార్వతి.

"నేను అదే అన్నానమ్మా! అల్లుడు వింటేగా! పైగా ఊరుకోండి అత్తయ్యగారు, మీకు తెలీదా ఏమిటి? ఈ ఆషాఢమాసం, అత్తగారు, ఒకే గడప, ఇదంతా ఓ మూఢనమ్మకం... అయినా ఇలాంటి పట్టింపులు, నమ్మకాలు... సామాన్య స్త్రీలకు మాత్రమే. రమ్యలాంటి ఉత్తమురాలికి కాదు అని అన్నాడొదినా!... అతనన్న తర్వాత గుర్తొచ్చింది. మా రమ్య నిజంగా ఉత్తమురాలేనని!... నేనెలా మర్చేపోయానొదినా ఆ విషయం?" అమాయకంగా అంది కామాక్షి.

పార్వతమ్మ నివ్వెరపోయింది.

"మీ అల్లుడో ఆషాఢభూతి, మీ అమ్మాయి ఓ ఉత్తమురాలు... బావుందే నీ వరుస... మీ అల్లుడు నిన్ను ములగచెట్టు ఎక్కించాడు... జాగ్రత్త పడిపోగలవు. ఉత్తమురాలట! ఉత్తమురాలు!! ఓ పట్టింపు లేదు... పాడూ లేదు.... పిదపకాలం, పిదప బుద్ధులు. పెద్దలు ఎందుకు పెట్టారుట ఈ పద్ధతులు?!..." మెటికలు విరిచింది.

"అదేంటొదిన అలా అంటావు? మా అల్లుడన్నది అక్షరాల నిజమే... మా రమ్య నిజంగా ఉత్తమురాలే!... మన పెద్దవాళ్ళు అన్నది మర్చిపోయావా?.... అత్తలేని కోడలుత్తమురాలు అన్నారు కదా!... మన శాస్త్రం కూడా అదే చెప్పింది మరి! అయినా మా రమ్యకు అత్తగారు లేరన్న విషయం నువ్వు కూడా ఎలా మరిచి పోయావొదినా!" కామాక్షి ముసిముసిగా నవ్వుతూ అంది.

ఆ మాటకు పార్వతి అవాక్కయ్యింది.

చేసేదేం లేక గోడ చాటుకు వెళ్ళిపోయింది.

ఎవరు మాత్రం ఏం చేయగలరు? శాస్త్రమెప్పుడూ ఏం చెప్పినా నిష్కర్షగానూ, కర్కశంగానూ చెబ్తుంది. మనం సౌమ్యంగా సారాంశమే తీసుకోవాలని పింగళి వారు ఎప్పుడో అన్నారుగా. ఇక మనం 'అంతేగా...అంతేగా' అనుకోవాలి తప్పదు మరి!

ముళ్లపూడి హాస్య కథల పోటీలో
బహుమతి పొందిన కథ





మన్నవ ప్రియాసిస్టర్స్
9290144150

# భాష


'మాటి మాటికి 'భాష' అని అంటారేంటీ? ఇంతకీ మా అమ్మాయి మీకు నచ్చిందా లేదా ముందు అది చెప్పండి?' అని పెళ్ళికూతురు తండ్రి సుందరం చాలా కోపంగా అడిగాడు- పెళ్ళికొడుకు కళ్యాణ్‌ని.

కళ్యాణ్ నవ్వాడు. సుందరం పెద్ద కూతురు చిత్రను ఈ మధ్యనే కళ్యాణ్ పెళ్ళిచూపులు చూసొచ్చాడు. కొంతకాలం ఆగమన్నాడు కళ్యాణ్. విచిత్రం ఏమిటంటే, చిత్ర, కళ్యాణ్ ఇద్దరూ సాఫ్ట్‌వేర్ సహఉద్యోగులు.

కళ్యాణ్ ప్రవర్తనకి కోపాన్ని తట్టుకోలేకపోతున్నాడు సుందరం. అతనితో పాటు అడగటానికి వచ్చినవాళ్ళు సుందరాన్ని శాంతింపచేస్తున్నారు.

'భాష' ఏంటండీ... 'భాష'! మా 'భాష' బానే వుంది కదా!... పెళ్ళిచూపులకు వచ్చినపుడు మీరు మా 'భాష'ను చూశారు. మా అమ్మాయి 'భాష' మీకు బాగానే తెల్సు... మరీ విడ్డూరం కాకపోతే, మేము తెలుగు 'భాష' కాకపోతే మరే ఏదైనా భాష మాట్లాడుతున్నామా?..." కాస్త ఘాటుగానే అడిగాడు సుందరం.

"నేనేమీ కాదనటం లేదు కదా! అయితే మా 'భాష' కు పరీక్షలున్నాయి. నేను పెళ్ళిచూపులకు వచ్చినపుడు మా 'భాష' చాలా వత్తిడిగా వుంది. అందుకే మాతో 'భాష' రాలేదు. అందుకే మిమ్మల్ని అభ్యర్థించేది ఏమిటంటే... మరోసారి పెళ్ళిచూపులు ఏర్పాటు



చేయండి... అప్పుడు మాతో 'భాష' కూడా వస్తుంది! చాలా సంతోషపడుతుంది. అందుకే పరీక్షలు అవీ అయిపోగానే ఒక్కసారి మళ్ళీ పెళ్ళిచూపులు చూసి అప్పుడు ముందుకెళ్దాం. అప్పుడు మీకు పెళ్ళికి టైము దొరికినట్టుంది. మా 'భాష'కు పరీక్షల వత్తిడి కూడా అయి పోతుంది" అని అన్నాడు కళ్యాణ్.

ఏం మాట్లాడాలో తెలియక జుట్టు పీక్కు న్నాడు సుందరం– 'ఇంట్లో అందరికీ ఓకే అని చెబుతున్నాడు కళ్యాణ్, మరో ప్రక్క 'భాష' అని అంటున్నాడు?'

"మీరేమీ కంగారు పడకండి మామయ్య గారు" అని కళ్యాణ్ భుజం తడుతూ అన్నాడు.

"హమ్మయ్య!" అనుకున్నాడు సుందరం.


పైగా తనని మామయ్యగారు అని సంబో ధిస్తున్నాడు కాబట్టి... ఈ పెళ్ళి విషయంలో తను అనుమానం పడక్కర్లేదు' అని సంతోష పడ్డాడు సుందరం.

✦ ✦ ✦

కళ్యాణ మండపం మొత్తం చాలా హడా వుడిగా వుంది.

'కళ్యాణ్ కోరినట్టుగానే పెళ్ళిచూపులు ఏర్పాటు చేయటం... పెళ్ళి మూహూర్తం నిర్ణ యించుకోవటం... తాంబూలాలు మార్చుకో వటం... ఇదిగో కళ్యాణమండపం దాకా రావటం జరిగింది.

పెళ్ళిమండపం మీద కళ్యాణ్, తన కూతురు చిత్ర చూడముచ్చటగా వున్నారు. పెళ్ళయి పోయింది. తర్వాత పనులకు వెళ్ళే మధ్యలో వధూవరులకు కొద్దిగా రిలీఫ్ దొరికింది.




అప్పుడు సుందరం,కళ్యాణ్ వద్దకు వచ్చాడు.

"బాబు ఒక ప్రశ్న!' అని అడిగాడు.

'చెప్పండి?' అన్నట్లు చూశాడు కళ్యాణ్.

"ఏమీ లేదు. మా అమ్మాయిని మీరు పెళ్ళి చేసుకున్నారు. చాలా సంతోషం. ఇంతకీ మా 'భాష' మీకు నచ్చినట్లేగా?" అని అడిగాడు సుందరం.

"మీ 'భాష' కేం బ్రహ్మాండంగా వుంది!..." అని అన్నాడు.

"అది కాదు... మీరు మళ్ళీ పెళ్ళిచూపులు ఏర్పాటు చేయాలని చెబుతూ... మాకు 'భాష' సమస్య వుంది... పరీక్షలు ఉన్నాయి" అని అన్నారు కదా! అందుకే అడుగుతున్నాను. మా 'భాష' కూడా మీకు నచ్చిందా?..." అని గొణిగాడు సుందరం.

దాంతో కళ్యాణ్ పెద్దపెట్టున నవ్వాడు.

'భాష' అంటే మీకలా అర్థం అయిందా? అంటూ 'భాష' అని గట్టిగా పిలిచాడు కళ్యాణ్.

అంతే! కళ్యాణ్ ఇద్దరు చెల్లెళ్ళు రక్కున ప్రత్యక్షమయ్యారు.

'భాష' అంటే వీళ్ళే!" చెప్పాడు కళ్యాణ్.

"వీళ్ళా?!" అని నోరువెళ్ళపెట్టాడు సుందరం.

"ఏం లేదు మామయ్యగారు! పెద్దచెల్లెలు పేరు షణ్ముఖ, చిన్న చెల్లి పేరు భార్గవి... అందుకే నేను పిలిచినపుడు వాళ్ళిద్దరూ ఒకే సారి పలికేలా చిన్నచెల్లి పేరులో ముందు అక్ష రాన్ని, పెద్ద చెల్లెలు పేరులో మొదటి అక్షరాన్ని చేర్చి 'భాష' అని పెట్టుకున్నాను. అంతే!!" అని నవ్వుతూ చెప్పాడు కళ్యాణ్.


"పోన్లే బాబు ఇప్పటికైనా చెప్పావు. నా మనసు కుదుట పడింది. నాదో విన్నపం. ఏంటంటే, నువ్వు మీ ఆవిడని ఏ పేరుతోనైనా పిలుచుకో గాని...మా చిన్నమ్మాయి పేరు తగి లించి మరీ నిక్‌నేమ్ పెట్టి పిలవకే" అన్నాడు సుందరం.

"ఇంతకీ మీ చిన్నమ్మాయి పేరేంటో? అడిగాడు కళ్యాణ్,

"గోపిక!" అని చెప్పాడు సుందరం.

కళ్యాణ్ నోరు తెరచి ఏదో అనబోతుంటే...

వెంటనే సుందరం, కళ్యాణ్ నోరు మూసే శాడు. అక్కడ నవ్వులు మురిసాయి.



# నవ్వులాట

గాంధీ మనోహర్, 98490 51846

## ప్రాక్టికల్ జోకరన్న

కొండబాబుకు అమాయకులతో ఆడుకోవడం పిచ్చ సరదా!


తను ఎప్పుడైనా బజార్లో నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు.. ఎవరైనా ఇంటి గేటు బయట బొగ్గుతోనో, చాక్‌పీస్‌తోనో 'టులెట్' అని రాసి, తదుపరి జరగబోయే ఎంటర్‌టైన్మెంట్ కోసం అక్కడే కాస్త దగ్గరలో చూస్తూ నిలబడే వాడు.

'టు లెట్' అని చూసిన వాళ్ళు... ఆ ఇంటి వాళ్ళ కాలింగ్‌బెల్ కొట్టి... అద్దింటి గురించి అడిగేవాళ్ళు. అలాంటిదేమీ లేదని వాళ్ళు అనడం... అది ఎవరో రాశారని వాళ్ళు తెల్సుకోవడం... వచ్చిన వాళ్ళు నిరాశాగా తిట్టుకుంటూ వెళ్ళిపోవడం జరిగేది.

కొండబాబు ఇలా ప్రాక్టికల్‌జోక్స్‌తో జనాల్ని ఇబ్బంది పెట్టి... తను ఎంజాయ్ చేసేవాడు.

కొండబాబు కొన్ని ప్రాక్టికల్‌జోక్స్‌లో అప్పుడప్పుడూ కూసింత మోసాన్ని కూడా మిక్స్ చేసి డబ్బు సంపాదించేవాడు.

ఓ రోల్డ్ గోల్డ్ చెయిన్ వందకో యాభై కో కొనేవాడు... దాన్ని రోడ్ మీద పడేసి అక్కడే దగ్గరలో నిలబడే వాడు. ఎవరైనా ఆ చెయిన్ తీసుకోగానే అప్పుడే తనూ పరుగెత్తు కుంటూ వచ్చి... "అది మా పాప చెయిన్ సర్! ఇందాకే పోయింది... దాని గురించి వెతుక్కుంటూ వస్తుంటే... మీకు దొరికింది. మీకు కావాలంటే వెయ్యి రూపాయలు ఇస్తాను. ఆ చెయిన్ నాకు ఇవ్వండి." అని చార్లీచాప్లిన్ లెవల్లో నటించే వాడు.




"కావాలంటే మీకే నేను వెయ్యి రూపాయలు ఇస్తాను... నాకు ఈ చెయిన్ కావాలి" అనే వాళ్ళు ఆ చెయిన్ దొరికిన అమాయక పీపుల్స్.

కొండబాబు ముందు కాదని, లేదని బెట్టు చేసినట్టు యాక్టింగ్ చేసి, చివరికి వాళ్ళ దగ్గరి నుండి ఆ వెయ్యి రూపాయలు తీసుకుని అక్కడి నుండి జారుకునేవాడు.

వీలున్నపుడల్లా... ఇలాంటి చీటింగ్‌లు చేయడం... అలవాటుగా పెట్టుకుని జనాల అమాయకత్వంతో ఆట్లాడుకునేవాడు సదరు ప్రాక్టికల్ జోకర్ కొండబాబుగారు.

కొండబాబు అభిమాన హీరోయిన్ త్రిష. ఆ విషయం తన భార్య నాగమణికి కూడా తెల్సు. నాగమణి ప్యూర్ అమాయకురాలు. కల్లాకపటం తెలీని అర్భకురాలు. ఒక్కమాటలో చెప్పాలంటే లేడీ స్వాతిముత్యం.

ఒకరోజు కొండబాబు ఆఫీస్ నుండి వచ్చి తను హీరోయిన్ త్రిషని పెళ్లి చేసుకున్నట్టు చెప్పాడు... అంతేకాకుండా తనూ త్రిష దండలతో వున్న పెళ్లి ఫోటో చూపించాడు. అది ఫోటోషాప్‌లో క్రియేట్ చేసిన ఇమేజ్ అని తెలిక కొండబాబు భార్య లబోదిబో అంది.

ఆ రోజంతా అన్నం తినకుండా అలిగింది. ఆత్మహత్య చేసుకుందామనుకుంది. కానీ... తన కడుపులో పెరుగుతున్న బిడ్డ కోసం తన ప్రయత్నాన్ని విరమించుకుంది.

చివరికి ఈ విషయాన్ని తన అమ్మానాన్నకు ఫోన్ చేసి చెప్పింది నాగమణి.

వాళ్ళు ఉరుకుల పరుగుల మీద వచ్చి వాలారు.

'ఇది పద్ధతి కాదని...' కొండబాబు మీద మామగారు కోప్పడ్డాడు.

"అభం శుభం తెలీని నా బిడ్డకు అన్యాయం చేయాలని నీకు ఎలా అనిపించిందని అల్లుడు గారు?" అని అత్తగారు భోరున విలపించారు.

అయినా కొండబాబు అసలు విషయం ఇంట్లో చెప్పలేదు.

దాంతో స్మశాన వాతావరణం చోటుచేసుకుంది.

నాగమణి గానీ ఆమె అమ్మా నాన్నగానీ అన్నం తినకుండా నీళ్ళు తాగకుండా అంగలారుస్తూ... కూర్చున్నారు.

వాళ్ళు పడుతున్న బాధని, వాళ్ళు అనుభవిస్తున్న వేదనని గుమ్మనంగా ఎంజాయ్ చేయసాగేడు సైకో కొండబాబు.

మూడు రోజుల తర్వాత తన క్రియేషన్ బట్టబయలు చేశాడు కొండబాబు.

అది నిజం కాదని తెల్సి కొండబాబు భార్యా ఆమె పేరెంట్స్ ఊపిరి పీల్చుకున్నారు.

అలాగే మరో రోజు కొండబాబు తను చనిపోయినట్టు పేపర్లో యాడ్ ఇచ్చాడు.

అది చూసిన బంధువులు, స్నేహితులు అలాగే ఇద్దరో ముగ్గురో అప్పిచ్చిన వాళ్ళు కొండబాబు ఇంటికి తరలి వచ్చారు.


అది నిజం కాదని తెల్సి... వచ్చిన వాళ్ళం దరూ ఆశ్చర్యపోయారు.

"ఎందుకిలా చేశావు?" అని అడిగితే...

"జస్ట్ సరదా! నేను చనిపోయానని తెలిస్తే ఎవరెవరు వస్తారు?...ఎంతమంది వస్తారో చూద్దామని ఈ ప్లాన్ అప్లై చేశా!" అని ఎకిలి నవ్వు నవ్వేశాడు కొండబాబు.

ఆ వచ్చిన వాళ్ళల్లో అర్జంట్ పనులు మాను కుని వచ్చిన కొందరైతే, ఆఫీస్‌లకు శెలవ్ పెట్టి వచ్చిన వాళ్ళు మరి కొందరువున్నారు.

వాళ్ళందరూ కొండబాబుని మనసులో... అమ్మనా బూతులు తిట్టుకుంటూ... వెళ్ళి పోయారు.




'అన్ని రోజులు మనవి కావు' అనే జీవిత సత్యాన్ని తెల్సుకునే రోజు రానే వచ్చింది... ప్రముఖ ప్రాక్టికల్ జోకర్ శ్రీకొండబాబు గారికి.

కుబేర బ్యాంక్‌లో కొండబాబుకు బ్యాంకు అకౌంట్ వుంది.

కానీ అందులో తనకి వున్న అకౌంట్లో మినిమం బ్యాలెన్స్ కూడా లేదు.

ఆ బ్యాంక్ పేరు మీద తనకి ఇచ్చిన చెక్ బుక్‌లో ఒక దాన్ని తీసుకుని... అందులో అమౌంట్ లక్ష రూపాయలు రాశాడు. అలాగే సంతకం కూడా చేశాడు. కానీ, పేరు మాత్రం రాయకుండా ఖాళీగా ఉంచాడు.

తర్వాత దాన్ని తీసుకెళ్ళి జనాలు తిరిగే రోడ్ మీద విసిరేశాడు.

కారణం... అది దొరికిన వాళ్ళు ఎవరైనా దాని మీద వాళ్ళ పేరు రాసుకుని బ్యాంకుకు వెళ్తారనీ... కానీ తన అకౌంట్‌లో బ్యాలెన్స్ లేదని బ్యాంకు వాళ్ళు చెబుతారనీ, దాంతో వాళ్ళు ఫూల్ అవుతారని కొండబాబు ఎక్స్‌పెక్ట్ చేసి లోలోన ముసి ముసిగా నవ్వుకున్నాడు.

న్యాయశాస్త్రం గురించి బాగా తెల్సిన గిరీశం అనే కేటుగాడికి ఆ చెక్ దొరికింది.

దాని మీద తన పేరు రాసుకుని బ్యాంకుకు వెళ్లి దాన్ని డిపాజిట్ చేశాడు.

కొండబాబు ఊహించినట్టుగానే బ్యాలెన్స్ లేని కారణంగా ఆ చెక్ బౌన్స్ అయింది.

గిరీశం అంతటితో ఊరుకోలేదు.

తనకి ఇవాల్సిన లక్షరూపాయలకు కొండ బాబు చెక్కు ఇచ్చాడనీ... అది బౌన్స్ అయిం దనీ... అందుకే అతని మీద తను చెక్‌బౌన్స్ కేసు పెట్టినట్టు చెప్పాడు.

దాంతో కొండబాబు కోర్ట్‌కు రాక తప్పలేదు.

ఆ చెక్కు పోయిందనీ... అది గిరీశం అనే వ్యక్తికి దొరికిందనీ... అంతే తప్ప ఆయనకు తను పది రూపాయలు కూడా బాకీ లేనని కోర్ట్‌లో గగ్గోలు పెట్టాడు కొండబాబు.

కానీ కోర్ట్ అది నమ్మలేదు సరికదా దాని నిమిత్తం పెనాల్టీతో కలిపి గిరీశానికి లక్షా ఎనభై వేలు వారంరోజుల్లో చెల్లించాలని కోర్ట్ తీర్పు ఇచ్చింది.

ఇక చేసేదేమీ లేక వైజాగ్ భీమిలీ బీచ్ దగ్గరలో తన పేరు మీద వున్న యాభై గజాల స్థలం అమ్మి ఆ మొత్తాన్ని గిరీశంకు సమ ర్పించుకున్నాడు కొండబాబు.

తను చేసిన చిల్లర పని వల్ల ఇంత దారుణం జరుగుతుందని కొండబాబు డ్రీం లో కూడా ఊహించలేదు.

ఈ దుర్ఘటన తర్వాత యూట్యూబ్‌లో ప్రాంక్ వీడియోలు చూడాలన్నా భయంతో వణికి పోయేవాడు కొండబాబు.

కాబట్టి ఇతరులను ప్రాంక్ చేసి నవ్వు కోవ డమే కాదు అలా చేసేవాళ్ళకు కూడా ఒక్కో సారి ఏడుపు తెప్పించే ఆస్కారం లేకపోలేదని గుర్తుపెట్టుకుంటే మంచిది.









**గతంలో...** అమెరికాలో స్థిరపడ్డా బ్రహ్మాచారి చందు. అందరికీలానే చందు పెళ్ళికోసం తండ్రి తన మరదలు సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకోమని నెత్తినోరు కొట్టుకుని మొత్తుకుంటుంటాడు. తనకి మరదలు మీద ఏ ఫీలింగ్ లేదని చందు తెగించి చెప్పేస్తాడు. మూడు నెలల్లో యోగ్యురాలైన అమ్మాయిని తెచ్చి మా ముందు పెట్టు... లేదంటే చచ్చిపోతానని బెదిరిస్తూ తండ్రి ఈమెయిల్ పంపిస్తాడు. అమ్మాయిని వెతికే పనిలో ఉంటాడు చందు. మెక్సికన్ కిడ్నాపర్ ఓలేకి, సుబ్బు ఒక ఫోటో ఇచ్చి, ఆ అమ్మాయిని కిడ్నాప్ చేయమని చెప్తాడు. ఆ అమ్మాయి తెలంగాణ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో 6వ అయిటమ్ చేసే అమ్మాయని చెప్తాడు. ఆ కార్యక్రమం అయిపోయాక సౌమ్యను కిడ్నాప్ చేసి, ఒక గదిలో బంధిస్తాడు ఓలే!.... సౌమ్య ఓలేని నానా విధాలుగా ఇబ్బంది పెడుతుంటుంది. ఆమె పెట్టే ఇబ్బందులు భరించలేక ఆమెని విడుదల చేస్తాడు ఓలె.

ఇందునాన్న తెలంగాణ అబ్బాయికే యిచ్చి ఇందు పెళ్ళి చేయాలను కుంటుంటాడు. ఇందు, ఆంధ్ర కురాడ్రు చందుని ఇష్టపడుతుంది. అయితే గతంలో వజ్రాల హారం దొంగతనానికి ఇందూ చందూల పెళ్ళికి కారణమవుతుంది. **ఇప్పుడు...**

**సంజీవని కిడ్నాపు, ఉత్తరాల ద్వారా బెదిరించి నగను రాబట్టే పని వీసాచారి గ్యాంగుకు అప్పగిస్తే, రాఘవరావును గమనించే పనిని బబ్లూకు అప్పగించాడు సుబ్బు.**

**వీసాచారి, ఆ నగకు ఆశపడి... దాన్ని దక్కించుకొని తనకు ఇవ్వకుండా మోసం చేసే అవకాశం ఉంది కాబట్టి, రాఘవరావు రాగానే తానే వెళ్ళి అతడిని ఫాలో అవ్వాలనేది సుబ్బు ప్లాన్. కాని పోలీసు వల్ల టైం వేస్ట్ అయ్యింది. అయితే, సుబ్బు ప్లాన్-బి గా బబ్లూను పెట్టాడు. ఇక సుబ్బు, కారెక్కి మార్వాడీ దగ్గరకు వెళ్ళాడు.**

**మార్వాడీ, సుబ్బుకు నగను ఇస్తూ- "సుబ్బూ సాబ్! మీకు అభ్యంతరం లేకపోతే, ఈ నగతో ఏం చేయబోతున్నారో చెప్తారా?" ఓ రాయి విసిరి చూసాడు మార్వాడీ.**

"నా లవ్వర్, ఒక లైబ్రరీలోని ఒక బుక్‌లో 56 వజ్రాలున్న ఓ పాత నగ ఫోటో చూసింది. అదెక్కడ తేను? అందుకే గిల్టు నగ చేయించాను!" అని సుబ్బు, అస్సలు అతకనట్లు అబద్ధం చెప్పి... డబ్బిచ్చి బయటకు నడిచాడు.

'ఎంతైనా నీతితో బతికే లాయర్ రామానికి, ఈ దొంగవెధకు చాలా తేడా ఉంది! హంస హంసే, రాబందు రాబందే!...'అనుకున్నాడు మార్వాడీ.

సుబ్బు చేతిలో ఉన్నది గిల్టు నగ నంబర్2!

అయితే, సుబ్బు కారును అనుసరించి వచ్చిన లాయర్ రామం, రచన... సుబ్బు మార్వాడీ కొట్టులోకి వెళ్ళి రావడం చూసారు.

"హమ్మ సుబ్బుగా! నువ్వు గిల్టు నగ చేయించావా! అయినా, నీకెందుకురా గిల్టు నగ!" బయటకే అనేసింది రచన.

సుబ్బు, తన కారెక్కుతున్నాడు.

రామం లాయర్ బుర్ర చాకులా పని చేసింది!

"ఆ కిడ్నాపింగ్ చేసి, రాఘవరావును బెదిరించి, నగను కలెక్ట్ చేసుకునే పనిని ఎవరో గ్యాంగుకు అప్పగించి ఉంటాడు.వాళ్లు, రాఘవరావు ఇచ్చే నగను ఎత్తుకుపోతే కష్టమని, ఈ నగ చేయించి ఉంటాడు!" అన్నాడు రామం.

సుబ్బు కారు కదిలింది.

అతని కారును అనుసరిస్తూ, లాయర్ రామం కారు కదిలింది.

✦✦✦

బబ్లూ, సుబ్బుకు ఫోన్ చేసి చెప్పాడు–

"రాఘవరావు కారు ఇప్పుడే బయల్దేరింది. అందులో, ఇందు చందు... ఓ చిన్న బాక్సు తీసుకొని వెళుతున్నారు... నేను ఫాలో అవుతున్నాను!"

"సరే! వాళ్లు ఏ రూట్లో వెళుతున్నారో నాకు అప్డేట్ ఇవ్వు, నేను హైవే ఎక్కుతాను. వాళ్ళు ఎటు వైపు వెళుతున్నారో పక్కాగా క్లారిటీ వస్తే, వెంటనే చెప్పు!" అన్నాడు సుబ్బు, కారు వేగంగా నడుపుతూ!

✦✦✦

వీసాచారి తన దగ్గరున్న డూప్లికేట్ నగ నంబర్3తో కారెక్కి, నింపాదిగా నడుపుకుంటూ హ్యూస్టన్ నగరంలోని స్టాఫోర్డ్‌లో ఉన్న బాప్స్ స్వామినారాయణ్ మందిర్ వైపు వెళ్లసాగాడు.

అయితే... అతని కారును కిశోరీలాల్ తాలూకు అమెరికన్ రౌడీలు అనుసరిస్తున్న విషయం అతనికి తెలియదు.

✦✦✦

"సుబ్బు! ఇందు చందుల కారు స్టాఫోర్ట్ వెళుతున్నట్లు ఉంది. అంటే స్వామి నారాయణ్ మందిర్ వైపు! అక్కడే ఎక్కడో స్పాట్ ఫిక్స్ చేసినట్లు ఉన్నారు!' ఫోన్ లో చెప్పాడు బబ్లూ.

"సరే!.. నేను హైవేలో లేన్ మారతాను... వస్తున్నాను!" అన్నాడు సుబ్బు, కారు వేగంగా నడుపుతూ.

రామం, రచన... సుబ్బు కారును అనుసరిస్తూనే ఉన్నారు!

సుబ్బు, ఓసారి వీసాచారికి ఫోన్ చేద్దాం అనుకున్నాడు... కానీ తమాయించుకొని, ఊరుకున్నాడు!

✦✦✦

ఇందు చందుల కారు, పిల్ల కాలువ వెంట వెళుతోంది.

టెన్షన్లో అడ్డదిడ్డంగా డ్రైవ్ చేస్తూ వస్తున్న బబ్లూ కారును ఓ పోలీస్ ఆపాడు.

"సుబ్బు! ఓ పోలీస్ నన్ను ఆపాడు. ఇందు చందు... ఇక్కడే ఉన్న పిల్లకాలువ వెంట ఉత్తరం వైపు వెళుతున్నారు. ఇక ఉంటాను!" అని కాల్ కట్ చేసాడు.

పోలీస్ బబ్లూ దగ్గరకు వచ్చి, కారు అద్దంపై తట్టాడు. రూల్ ప్రకారం బబ్లూ, తన రెండు చేతులు స్టీరింగ్ మీద పెట్టి కూర్చున్నాడు.

కిటికీ అద్దం తెరవమని పోలీస్ అడిగాడు.

బబ్లూ కిటికీ అద్దం కిందకు దింపాడు.

"హలో జెంటిల్మేన్! అరెంటుగా బాత్ రూం వస్తోందా ఏంటి?" అన్నాడు సెటైరికల్‌గా!

బబ్లూ– "హిహిహిహి... సార్!... అదీ... మరీ..." అని ఏం కారణం చెప్పాలో వెతుక్కోసాగాడు.

✦✦✦

ఇందు చందు, ఆ బండరాయి కింద తమ దగ్గరున్న నగను(డూప్లికేట్ 1) పెట్టేసి, వెనక్కి వెళ్ళిపోయారు.

వాళ్ల కారు వెళ్ళిపోయాక, సుబ్బు కారు అక్కడికి వచ్చింది.

దూరం నుండి బైనాక్యులర్స్‌లో ఇదంతా గమనించిన సుబ్బు, ఆ బండరాయి దగ్గరకు వెళ్ళి, దాని కింద, ఇందు చందులు పెట్టిన



నగను(డూప్లికేట్ 1) తన్మయత్వంతో తీసుకొని, తన దగ్గరున్న నగను(డూప్లికేట్ 2) బండరాయి కింద పెట్టి, వెనక్కి రాకుండా... అలాగే ఉత్తరం వైపు వెళ్ళిపోయాడు.

వెనక్కి టర్న్ చేస్తే, ఈలోపు వీసాచారి కారు అటుగా వస్తే కష్టమని అతని అభిప్రాయం.

ఉత్తరం వైపు అలా పది కిలోమీటర్లు వెళ్ళి, రెండు మూడు కాలనీలు తిరిగి, హైవే ఎక్కాడు!

"ఓరి వీసాచారి! నేను వెళ్ళేది కాలిఫోర్నియా కాదురా! హ్హా...హ్హా...హ్హా ! ఓరి పిచ్చినా అమెరికా పోలీసు...నేను వెళ్ళేది వాషింగ్టన్ కాదురా! నేను వెళ్ళేది లాస్ వెగాస్‌కు! అక్కడ నా దగ్గరున్న ఒరిజినల్ నగను అమ్మేయబో తున్నాను! హ్హా హ్హా హ్హా !"అని నవ్వుకుంటూ, విజిల్ వేసుకుంటూ...

"సాధించాను... 56 వజ్రాలున్న నగను సాధించాను!" అని కేకలు వేస్తూ డ్రైవ్ చేయ సాగాడు!

నిజానికి, సుబ్బు ఆ గిల్టు నగ చేయించ కుండా డైరెక్టుగా ఇందు చందుల నగ ఎత్తుకుపోయే ప్లాన్ వేసి ఉండొచ్చు. అలా చేస్తే, ఆ కోపంతో వీసాచారి తన గ్యాంగుతో, సంజీవనిని సఫా చేయించవచ్చు.... మర్డర్ అయితే పోలీసులు చాలా తీవ్రంగా తీసుకొని ఇన్వెస్టిగేట్ చేస్తారు. అదంతా తన మెడకూ చుట్టుకుంటుంది. ఒకవేళ, తాను సమాయా నికి ఇక్కడికి రాలేకపోయి ఉంటే... వీసాచారి ఆ నగను తీసుకుపోయేవాడు... అప్పుడు




**ప్రముఖ కార్టూనిస్టు శ్రీ పద్మాదాస్(దాస్)గారు రోటరీక్లబ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన సందర్భంగా హాస్యానందం మరియు కార్టూనిస్టు మిత్రుల శుభాకాంక్షలు!**

అతడిని ఎలాగైనా వెంటాడి, పట్టుకొని నగను ఉపాయంగా సాధించాలంటే తనకు ఒక గిల్టు నగ అవసరమని సుబ్బు ఆలోచించాడు!

దాదాపు ఇలాగే వీసాచారి కూడా ఆలో చించాడు! అయితే తన కారును రామం... రచనల కారు వెంబడించిందని, తాను బండ రాయి కింద నగను మార్చడం తమ బైనా క్యులర్స్‌లో చూసేసి, పగలబడి నవ్వుకుంటూ వెనక్కి తిరిగి వెళ్ళిపోయారని... సుబ్బుకు తెలియదు.

✦✦✦

వీసాచారి వచ్చి, బండరాయి కింద ఉన్న నగను(డూప్లికేట్ 2) తీసుకొని, తన దగ్గరున్న నగను(డూప్లికేట్ 3) అక్కడ పెట్టేసి, వెంటనే అక్కడి నుండి ఆరు కిలోమీటర్లు ముందుకు వెళ్ళి, నాలుగయిదు సందులు తిరిగి, తన గ్యాంగుకు ఫోన్ చేసాడు!

"ఆ సంజీవనిని వదిలేయండి! మీ డబ్బు ఎప్పటిలాగే దల్బీర్ సింగ్ కారు షెడ్‌లో కలెక్ట్ చేసుకోండి!"

ఆ తర్వాత వీసాచారి విజిల్ వేస్తూ, జాలీగా పాటలు పాడుతూ, "ఒరే సుబ్బు!... ఇక నేను నీకు కనిపించను రా! ఈ నగతో నేను, నా కొడుకులు, నా మనుమళ్ళు, నా మనుమల మనుమళ్ళ మనుమలు... అందరం హ్యాపీగా తరతరాలు బతికేస్తాం! నేను ఫ్లోరిడా రాష్ట్రం వెళ్ళిపోతాను.... అక్కడి నుండి, దక్షిణ అమె రికా దేశాలకు వెళ్ళిపోతాను. అక్కడి నుండి డీల్ చేసి, యూరప్ వెళ్ళి సెటిల్ ఔతానురా సుబ్బుగా!... హ్హా హ్హా హ్హా.." అనుకున్నాడు వీసాచారి!


తన కారును, ఓ అమెరికన్ రౌడీ గ్యాంగు వెంటాడుతోందని వీసాచారికి తెలియదు.

✦✦✦

ఇందు చందు, సంజీవనిని క్షేమంగా ఇంటికి తీసుకొచ్చారు.

కారులో వెనక్కి వస్తున్నప్పుడే ఇందు చందుల వాలకం కనిపెట్టి... 'ఓహో..వీళ్ళు పూర్తిగా ప్రేమలో పడినట్లు ఉన్నారు!... మా ఆయన ఒప్పుకుంటాడో లేదో!' అని మనసులో అనుకుంది.

ఇంటికి వెళ్లగానే, రాఘవరావు తన భార్య



క్షేమంగా రావడం చూసి... ఆనందాన్ని ప్రకటిస్తూనే మరో పక్క టెన్షన్ వాతావరణాన్ని కాస్త చల్లబరచడానికి అన్నట్టు..."మొత్తానికి నీ బాధ పడలేక, నిన్ను వదిలించుకొని వెళ్ళిపోయింద్రా ఆ గుండాగాళ్ళు?" అన్నాడు రాఘవరావు.

సంజీవని నవ్వేసి,"నాకు కప్పులకొద్దీ కాఫీ ఇవ్వలేక... తెలుగు టివి ఛానళ్ళు అరేంజ్ చేయలేక... వదిలేసారు లెండి!" అంది.

"ఆ అల్లుడూ!... ఇంతకూ మీ నాన్నతో ఎప్పుడు మాట్లాడమంటావ్?..." అన్నాడు రాఘవరావు.

సంజీవని ఆశ్చర్యంగా చూస్తూ–

"ఔనా!ఒప్పేసుకున్నారా! ఆ అబ్బాయి... ఆంధ్రా! మళ్లీ, పేచీ పెట్టరు కదా?" అంది.


"అయ్యో! ఆ అబ్బాయి ఎవరనుకున్నావ్! ఆ 56 వజ్రాల నగను బ్రిటీషోళ్ళకు దక్కకుండా కాపాడిన రామశాస్త్రి వంశం వాడు! అయినా మంచి మనసున్నోళ్ళు ఆంధ్ర అయితేనేమి, తెలంగాణా అయితేనేమి!"అన్నాడు రాఘవరావు!

రామం–రచన వీళ్ళ ఇంటికి వచ్చి... విషయం చెప్పారు. అందరూ పగలబడి నవ్వారు! అయితే వీసాచారి కూడా డూప్లికేట్ నగ చేయించాడని, అసలు వీసాచారి అనే వాడొకడు ఉన్నాడని వీళ్ళకు తెలియదు!

అమెరికాలో రాత్రవగానే, చందు ఇంటికి వీడియోకాల్ చేసి, విషయం మొత్తం వివరించాడు చందు.

## ఈ నెల 'దినం'

ఇంటర్నేషనల్ డాగ్స్ డే -ఆగష్టు,26




ఆ తర్వాత రాఘవరావు– "ఆంధ్రా అయితేనేమి, తెలంగాణ అయితేనేమి? అందరం తెలుగోళ్లమే కదా! మా అమ్మాయికి, మీ అబ్బాయికి పెళ్ళి చేద్దాం సార్!" అన్నాడు రాఘవరావు.

చందు తండ్రి తలూపి–"భారత దేశపు సంపద, బ్రిటీష్ వారి చేతుల్లో పడకుండా కాపాడడంలో మన రెండు కుటుంబాలు కృషి చేసాయి బావగారు! అయినా మంచి మనసున్నోళ్ళు ఆంధ్ర అయితేనేమి, తెలంగాణా అయితేనేమి! శుభస్య శీఘ్రం!" అన్నాడు.

వీడియోకాల్ కట్ చేసారు.

"అంతా బానే ఉంది కానీ, ఆ సుబ్బు గాడిని అట్లా వదిలెయ్యడం మాత్రం బాగాలేదు!" అంది ఇందు.

"క్లైమాక్స్‌లో భారీ సెట్టింగ్‌లో, రోపులు కట్టుకొని ఎగిరెగిరి గాల్లోకి దూకి ఫైటింగులు చేస్తేనే హీరోలు కాదు! బ్రెయిన్ వాడే హీరోయిజమూ ఉంటుంది!" అన్నాడు చందు.

రామం కూడా నవ్వుతూ తలూపాడు.

"అంటే?"అంది ఇందు.

"వెయిట్ చెయ్యి!"అన్నారు రామం, రచన, చందు!

✦ ✦ ✦

వీసాచారి, హ్యూస్టన్ నగరం దాటి రెండు గంటలు డ్రైవ్ చేసి, మధ్యలో వాష్ రూం కోసం ఓ ఫుడ్ స్పాట్ దగ్గర ఆగాడు.

అతడు వాష్ రూముకు వెళ్లి, ఆ తర్వాత ఓ బర్గర్ ప్యాక్ చేయించుకొని తింటూ తన కారు దగ్గరకు వచ్చి, ఎక్కబోతుంటే..నలుగురు అమెరికన్ రౌడీలు అతడిని చుట్టుముట్టి–

"మర్యాదగా నీ దగ్గరున్న నగ ఇచ్చెయ్యి!" అన్నారు. **(సశేషం)**



# పదానందం 13



కూర్పు: పోపూరి విశ్వనాథ్, 9133197111

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | 4 | |
| | | | | | | 5 | 6 |
| 7 | | | | | | | |
| | | | | | | | |
| | 8 | | 9 | | | 10 | |
| 11 | | | | | 12 | | |
| | | | 13 | | | 14 | |
| | 15 | | | | 16 | | |

**ఆధారాలు:**

**అడ్డం:**

1. అలనాటి మేటి హాస్యనటుడు (3)
3. సొగసుకాడు (3)
5. నిద్రపుచ్చేపాట (2)
7. నిరుపేదతనం (6)
8. కాంతి సరిగాలేదు (4)
10. ఉత్తరాల చివర ఇది రాయడం రివాజు (2)
11. బంజరు (2)
12. నిజం కాదు (2)
13. అడవి (2)
14. వట్టి (2)
15. సంసారం (3)
16. పొందిక (2)

**నిలువు:**

1. రాత్రిపూట కనిపించని జబ్బు (4)
2. చిట్టిపొట్టి తగవులు (5)
3. బద్ధకస్తుడు (5)
4. పైకొచ్చిన జత (2)
6. లక్కపిడతలను ఇలాకూడా అంటారు (4)
8. యువత సరిగాలేదు (4)
9. పరిహాసం (4)
10. మామ ఇంట్లోనే అల్లుడు ఉండడం (4)

సమాధానం వచ్చే సంచికలో...

**గత సంచిక సమాధానం**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 స | వ్య | 2 సా | చి | | | 3 అ | తి |
| మా | | గ | | 4 ఓ | జో | ను | |
| 5 వే | త | నం | | ట | | మా | |
| శం | | 6 పు | 7 డ | మి | | 8 నం | గి |
| | 9 కొ | | గ్గు | | 10 చు | | |
| 11 అ | త్తి | ప | త్తి | | ర | | 12 చి |
| | మీ | | 13 క | 14 ట | క | టా | లు |
| 15 అ | ర | కు | | పా | | | క |


ఇంటిల్లిపాదినీ నవ్వించే పని పెట్టుకున్న
ఏకైక తెలుగు హాస్య మాస పత్రిక
హాస్యానందం
మనోవికాసానికి మందు
ఆనందం!...
హాస్యానందంతోనే
ఇది సాధ్యం!
చందాదారులుగా చేరండి.




Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

# చిరంజీవులకు ఆశీస్సులు



వేద సంహిత



స్కంద



మీనాక్షీ మధుప్రియ



రాఘవ రామ



కృష్ణ ముకుంద

సరసి, రత్నం

కృష్ణ చైతన్య
భారతి

యజ్ఞనారాయణ కాశ్యప
పుష్యమి

2024

Hasyanandam August-2024. RNI No. APTEL 08387/01/1/2003-TC


Scan to Reach us

www.kbncollege.ac.in

# మీ పిల్లల భవిష్యత్తు

బాగుండాలని
కోరుకుంటున్నారా?



అయితే సంప్రదించండి

▸ PG ▸ DEGREE ▸ INTERMEDIATE

భారీ ప్యాకేజ్ తో అత్యధిక
క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

హాస్టల్ సౌకర్యం
(BOYS & GIRLS)

A++ GRADE
CGPA 3.53
ACCREDITED BY
NAAC
NATIONAL ASSESSMENT AND ACCREDITATION COUNCIL

UGC-CPE

# K.B.N.COLLEGE

SKPVV INSTITUTIONS

(AUTONOMOUS)

(Sponsored by S.K.P.V.V.Hindu High Schools Committee)
Accredited by NAAC with "A++" Grade (4th Cycle)
1-Town, Kothapeta, Vijayawada - 520 001. Ph : 9182907747